# చెలి

# నిద్రలో పట్టే చెమటకు..

వేడి వాతావరణం, గాలి ప్రసరణ సరిగ్గా లేకపోవడం, ఒంట్లో వేడి ఎక్కువగా ఉండడం.. ఇలాంటప్పుడు చెమటలు పట్టడం సర్వసాధారణం. అయితే కొంతమందికి వాతావరణం చల్లగా ఉన్నప్పటికీ రాత్రుళ్లు నిద్రలో విపరీతంగా చెమటలు పడుతుంటాయి. చిన్న సమస్యే కదా అని చాలామంది ఈ విషయంలో నిర్లక్ష్యం చేస్తుంటారు. కానీ ఇది వివిధ రకాల అనారోగ్యా లకు సంకేతమని హెచ్చరిస్తున్నారు నిపుణులు. సమస్య తీవ్ర రూపం దాల్చకముందే మేల్కొని వైద్యుల్ని సంప్రదించడం ఉత్తమమని చెబుతున్నారు. మరి ఇంతకీ రాత్రుల్లు ఉన్నట్లుండి చెమటలు ఎందుకుపడతాయి?తెలుసుకుందాం..



**ఇవి కారణం కావచ్చు!...**
రాత్రుళ్లు నిద్రలో చెమటలు పడుతున్నాయంటే కొన్ని ఆరోగ్య సమస్యలు అందుకు కారణం కావచ్చంటున్నారు నిపుణులు.

**హైపర్ థైరాయిడిజం....** థైరాయిడ్ గ్రంథి జీవక్రియలతో పాటు ఇతర శారీరక విధులు నిర్వర్తించడంలో సమర్థంగా పనిచేస్తుంది. అయితే ఇది అత్యంత చురుగ్గా మారినప్పుడు హైపర్ థైరాయిడిజం బారిన పడతాం. ఫలితంగా శరీం వేడికి తట్టుకోలేక చెమటలు పడుతుంటాయి.

**ఒత్తిడి, ఆందోళన...** ఉన్నట్లుండి ఒక్కోసారి ఒత్తిడి, ఆందోళనలకు గురవుతాం. వాటి ప్రభావం మెదడు, శరీరంపై పడుతుంది. నిద్రలో చెమటలు పట్టడానికి ఇదీ ఓ కారణమే !

**మానసిక రుగ్మతలు :** కొన్ని రకాల మానసిక రుగ్మతలున్నప్పుడు మనసులో ఒక రకమైన యాంగ్జైటీ, ఆందోళన మొదలవుతుంది. ఇది నిద్రలో చెమటలు పట్టేలా చేస్తుంది.

**మెనోపాజ్...** 40 దాటిన మహిళల్లో రాత్రుళ్లు నిద్రలో చెమటలు పడుతున్నాయంటే. వారు మెనోపాజ్‌కు చేరువవుతున్నారనడానికి సూచనగా భావించ వచ్చంటున్నారు నిపుణులు. టివి/హెచ్ఐవి, లుకేమియా.. వంటి సమస్యలు న్నప్పుడు ఉన్నట్లుండి శరీరంలో ఉష్ణోగ్రత పెరిగి పోతుంటుంది. ఇది రాత్రుళ్లు చెమటకు దారి తీస్తుంది. యాంటీ డిప్రెసెంట్స్, యాంటీ రెట్రోవైరల్స్ హైపర్‌టెన్షన్ మందులు వాడడం వల్ల చెమట గ్రంథుల్ని నియంత్రించే మెదడు భాగాలపై ప్రతికూల ప్రభావం పడుతుంది. ఫలితంగా నిద్రలో చెమటలు పడుతుంటాయి. కెఫీన్ ఎక్కువగా ఉండే పదార్థాలు మితిమీరి తీసుకోవడం వల్ల కూడా రాత్రుళ్లు చెమటలు పట్టే అవకాశం ఎక్కువంటున్నారు నిపుణులు.

**ఈ జాగ్రత్తలు తీసుకోవాల్సిందే !..**
అయితే రాత్రి పూట నిద్రలో చెమటలు పట్టడమనేది తరచూ తలెత్తినా, దీంతో అసౌకర్యంగా అనిపించినా ఆలస్యం చేయకుండా నిపుణుల్ని సంప్రదించాలి. తద్వారా సమస్యేంటో తెలుసుకొని.. చికిత్స తీసుకోవాలి. దీంతో పాటు కొన్ని జాగ్రత్తలు పాటించడం వల్ల కూడా ఈ సమస్య నుంచి ఉపశమనం పొందచ్చు. మెనోపాజ్‌కు దగ్గరవుతున్న, మెనోపాజ్‌లో దశలో ఉన్న మహిళలు ఆహారంలో పలు మార్పులు చేర్పులు చేసుకోవాలి. ఈ క్రమంలో మసాలా, కారం.. వంటివి దూరం పెట్టాలి. బరువును అదుపులో ఉంచుకోవడం వల్ల కూడా రాత్రుళ్లు చెమట సమస్యను తగ్గించుకోవచ్చు. ఇందుకోసం నిపుణుల సలహా మేరకు పోషకాహారం తీసు కుంటూనే.. వ్యాయామాలు చేయడం ముఖ్యం. కెఫీన్, మసాలాలు, కొవ్వులు ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలు, చాక్లెట్.. వంటి వాటిని ఎంత దూరం పెడితే అంత మంచిది. నిద్రించే ప్రదేశం చల్లగా ఉండేలా చూసుకోవాలి. అలాగే చల్లదనాన్ని పంచే పరుపులు, దిండ్లకు ప్రాధాన్యమివ్వడం ముఖ్యం. కొన్ని రకాల మందుల వల్ల ఈ సమస్య ఎదురవుతోందని గమనిస్తే వాటికి ప్రత్యామ్నాయంగా ఇతర మందులేవైనా వాడచ్చేమో నిపుణుల్ని అడిగి సలహా తీసుకోవడం మంచిది. మానసిక ఒత్తిళ్ల, ఆందోళనల్ని తగ్గించుకునేందుకు నిచ్చిన పనులు చేయడం, ఆహారంలో అవసరమైన మారునపలు చేసుకోవడం మంచిది. □

# తల్లికి బిడ్డలంతా సమానమే !



ఏ ఇంట్లో అయినా రెండు వరుస కాన్పుల్లో పుట్టిన ఎడ పిల్ల, కుడి పిల్ల ఉంటే వాళ్లిద్దరికీ అస్సలు పడిచావదు. మధ్యలో ఆ తల్లికి ఎన్నో సమస్యలు వస్తుం టాయి. ఇంట్లో ఒకరికి మించి పిల్లలు ఉంటే చాలు.. తరచూ తగాదాలే. 'అన్ననే నువ్వు బాగా చూస్తావ్'. చెల్లికే నువ్వు అన్నీ కొనిస్తావ్ అంటూ అలకబూను తుంటారు. ఇది కొంతవరకూ పరవాలేదు కానీ తోబుట్టువులపై ద్వేషం పెంచుకునే వరకూ వెళ్లకుండా చూసుకోవాల్సి న బాధ్యత తల్లిదండ్రు లదే. ఇందుకోసం నిపుణులు ఏం సలహా ఇస్తున్నారంటే.. తల్లిదండ్రులుగా ఇద్దరు పిల్లల్ని వేర్వేరుగా చూడాలన్న పక్షపాతం మీకు లేకపోయి ఉండొచ్చు. కానీ తరచూ ఒకరితో ఒకరు గొడవ పడటం, చిన్నబుచ్చు కోవడం చేస్తుంటే.. వారికి కాస్త మీ ప్రేమ అవసరం అని తెలుసుకోండి. ఇద్దరూ సమానమే అని చెప్పే ప్రయత్నం చేయండి. తనతో మీరు చిన్నప్పుడు ఎంత చనువుగా ఉండేవారో చెబుతూ ఉండండి ఇది తనలోని అభద్రతా భావాన్ని దూరం చేస్తుంది. ఆ జ్ఞాపకాలన్నీ క్రమంగా తన అపోహల్ని దూరం చేయొచ్చు. అమ్మా నాన్నలు వయసులో చిన్నది కదా అని ఆఖరిదానికి అడిగినవన్నీ తెచ్చివ్వడంలో తప్పులేదు. కానీ, అదే సమయంలో పెద్దవాడి ఇష్టాలకూ ప్రాధాన్యం ఇవ్వండి. లేదంటే, మీకూ, తనకీ, మధ్య చెల్లి వచ్చిందనే అభద్రత బాధ తోబుట్టువుతో గొడవలకు దారితీ స్తాయి. పిల్లల్లో అల్లరి, గిల్లికజ్జాలు మామూలే తప్పొవ్వులు ఇద్దరివైపూ ఉ ంటాయి. అలా కాకుండా పెద్దాడే చేసుంటాడు. లేదా చిన్నదే చేస్తుందిలా అనే నిర్ధరణకు వచ్చేయకండి. సమస్య ఏంటో తెలుసుకుని సరిదిద్దినప్పుడు గొడవలు రావు. ఇంకోసారి ఒకరి మీద మరొకరు ఫిర్యాదు చేసుకునే పరిస్థితి ఉండదు. □

# 'వాము'తో ఆరోగ్యం



ఈ రోజుల్లో చాలామంది అజీర్తి, దగ్గు.. వంటి చిన్న చిన్న ఆరోగ్య సమస్యలు వచ్చినా ట్యాబ్లెట్లతో తగ్గించుకుంటున్నారు. అయితే వీటిని తరచూ వాడడం ఆరోగ్యకరం కాదు. కాబట్టి వంటింట్లో లభించే వాముతో ఇలాంటి చిన్న అనారోగ్యాల్ని ఇట్టే దూరం చేసుకోవచ్చని చెబుతున్నారు నిపుణులు. అదెలాగో తెలుసుకుందాం..

**అసిడిటీకి దూరంగా...**
అసిడిటీతో బాధపడుతున్నారా? అయితే.. గిన్నెలో ఒక గ్లాసు నీళ్లు పోసి అందులో ఒక టీస్పూన్ వాము, ఒక టీస్పూన్ జీలకర్ర.. వేసి బాగా మరిగించాలి. అసిడిటీతో బాధపడు తున్నప్పుడు ఈ మిశ్రమాన్ని తాగితే సమస్య నుంచి తక్షణ ఉపశమనం కలుగుతుంది.

**గుండెకు రక్షణ ...** వాములో ఉండే నియాసిన్ గుండె సంబంధిత సమస్యలు దరి చేరకుండా కాపాడు తుంది.కొంచెం వామును నీళ్లలో వేసి మరిగించి రోజూ పరగడు పున తాగితే గుండె సంబంధిత వ్యాధులు రాకుండా ఉంటాయి.



**బాలింతలకు మేలు ! ...**
గర్భం దాల్చిన మహిళలకు, పాలిచ్చే తల్లులకు వాము చాలా ఉపయోగపడుతుంది. కడుపుతో ఉండే మహిళలకు సాధారణంగా ఎదురయ్యే మలబద్ధకం, అజీర్తిని ఇది దూరం చేస్తుంది. అలాగే బాలింతల్లో పాల ఉత్పత్తిని పెంచుతుంది.

**దగ్గు నుంచి ఉపశమనం ...**
వాములో ఉండే యాంటీ బ్యాక్టీరియల్ యాంటీ ఫంగల్.. మొదలైన గుణాల వల్ల దగ్గు, ఆస్తమా.. వంటి ఆరోగ్య సమస్యల నుంచి విముక్తి కలుగుతుంది. అలాగే ఇందులోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఆర్థ్రైటిస్ వల్ల ఏర్పడే నొప్పి నుంచి ఉపశమనం కలిగిస్తాయి.

**నోరు శుభ్రంగా...** వాము నూనెను టూత్‌పేస్ట్‌ల్లో, మౌత్ వాష్‌ల్లో వాడతారు. ఇది నోటిలోని బ్యాక్టీరియాతో పోరాడి నోటి నుంచి దుర్వాసన రాకుండా చేస్తుంది. అలాగేకొద్దిగా వామును నోట్లో వేసుకుని నమిలినా ఫలితం ఉంటుంది. నెలసరి సమయంలో చాలామంది మహిళలకు కడుపునొప్పి రావడం సహజం. అలాంటి సమయంలో వేయించిన వామును పాలలో కలిపి, వేడి చేసుకుని తాగినా ఫలితం ఉంటుంది. వామును కూరలు, పకోడీలు, పరాటాలు, చపాతీలు, మొదలైన ఆహార పదార్థాల తయారీలో వాడితే అటు రుచికి రుచి.. ఇటు ఆరోగ్యానికి ఆరోగ్యం సొంతం చేసుకోవచ్చు. వాము నూనెను కీళ్ల నొప్పులున్న చోట రాస్తే నొప్పి తగ్గిపోతుంది. వాము వేసి మరిగించిన నీటిని గోరువెచ్చగా అయ్యేదాకా పక్కన పెట్టాలి. ఆపై ఈ నీటితో పుక్కిలిస్తే పంటి నొప్పులు దూరమవుతాయి. గర్భవతులు వామును రోజూ తీసుకుంటే శరీరంలో రక్తం శుభ్రపడటంతో పాటు రక్తప్రసరణ బాగా జరుగుతుంది. వామును రోజూ ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల స్థూలకాయం, అధిక బరువు నుంచి విముక్తి పొందచ్చు. □

# పప్పుల వడ



**కావలసినవి :** పచ్చి శనగపప్పు, పెసరపప్పు, మినపప్పు, ఎర్ర కందిపప్పు, అల సందలు-అర కప్పు చొప్పున, నువ్వులు- పావు కప్పు, ఉప్పు- తగినంత, ఉల్లిపాయ ముక్కలు కప్పు, అల్లం, పచ్చిమిర్చి ముద్ద- రెండు చెంచాలు, కొత్తిమీర తరుగు- అరకప్పు, నూనె- వేయించేందుకు సరిపడా.

**తయారీ :** అన్ని రకాల పప్పులనూ నాలుగు గంటలు నానబెట్టి, దోశపిండిలా మరీ మెత్తగా కాకుండా.. కాస్త బరకగా రుబ్బు కోవాలి. అందులో ఉప్పు, అల్లం, పచ్చిమిర్చి ముద్ద, ఉల్లిపాయ ముక్కలు, కొత్తి మీర తరుగు వేసి కలపాలి. పిండిని చిన్న ఉండలుగా తీసుకుని, చేతిలో తట్టి వడలు చేసి కాగిన నూనెలో వేయిస్తే సరి. ఘుమఘుమలాడే ఆరు పప్పులు వడలు తయారైపోతాయి. □

# విశ్వమే ఒక మాయ

ఈ సువిశాల విశ్వమే ఒక మాయ. భూమి తన చుట్టూ తాను తిరుగుతూ సూర్యుని చుట్టూ తిరుగుతూ వుంటుంది. అందుకే ఒక్కోచోట ఒక రకంగా వాతావరణం మారుతూ ఉంటుంది. మనకు పగలు అయినప్పుడు, కొన్ని చోట్ల రాత్రి అవుతుంది. మనకు వర్షం పడితే కొన్నిచోట్ల చల్లని గాలులు విస్తూ ఉంటాయి. ప్రకృతి అంతా ఒకే తీరుగా ఉండదు. ఇలా ఒక వాతావరణం అంటూ ఉండదు. ఈ విశ్వ మాయకు మానవుడు అలవాటు పడుతున్నాడు. జీవన శైలి కూడ ఒక్కో చోట ఒక్కొక్క తీరుగా ఉంటుంది.మన ఆచారాలు, సంప్రదాయాలు ఒక రకంగా ఉంటాయి. పరాయి దేశస్తులవి వేరే విధంగా ఉంటాయి. అయితే చాలా దేశాలలో భారత్‌నే ఇష్టపడుతున్నారు. ఆస్తికులు కావొచ్చు నాస్తికులు కావొచ్చు మారుతున్న కాలానికి అబ్బుర పడవల సిందే. ఆస్తికులు అయితే ఇదంతా దైవలీల అంటారు. నాస్తికులు మాత్రం దీనితో ఏకీభవించరు . ఇది దైవలీల ఎలా అవుతుంది, అంటూ పలు రకాలుగా మాట్లాడుతూ, భూగోళంలో మార్పులు జరుగుతూ ఉంటాయి. సైన్స్ అభివృద్ధి చెందింది అంటూ ఘర్షణకు దిగుతారు. విశ్వం ఒక మాయ అంటే, కాదు అంటారు. ఆకాశంలో మార్పులు, నక్షత్రాలు, చంద్రుడు, సూర్యుడు వగైరా అంతా దైవ కృప అంటూ తమ వాదన సాగిస్తారు ఆస్తికులు. దీనికి ఎంత మాత్రం ఒప్పుకోరు నాస్తికులు.వాదనలు, తర్జన భర్జనలు ఎలా ఉన్నా వాస్తవానికి విశ్వంలో మార్పులు సహజం. ఆ మార్పులు వ్యక్తి జీవన విధానానికి తగ్గట్లుగా మానవుడు నడచు కుంటున్నాడు. నిజానికి ఒక్కో దేశంలో ఒక్కో వాతావరణం ఉన్నప్పుడు మనమే ఇదంతా భగవంతుని లీల అంటూ ఉంటాం. ఆ మాటలు విన్న నాస్తికులు మాత్రం ఇది ప్రకృతి మార్పు అంటారే కాని దైవ లీల అని మాత్రం అనరు. వాళ్ళు ఎంత మాత్రం దైవం అనే మాట ఎత్తరు. మానవుని మేధస్సుతోనే ఇలా జరుగుతోంది. దైవానికి ఇక్కడ స్థానమే లేదు అని ఖరా ఖండిగా చెబుతారు. మానవ శక్తి ముందు దైవ శక్తి ఎందుకు కొరగాదు అంటూ మానవునికే ప్రథమ స్థానం ఇస్తారు. ఆ ప్రథమ స్థానం దైవం ఇచ్చిందే అని ఆస్తికుల భావన. మార్క్స్ చెప్పినట్లు చారిత్రక గతి తార్కిక భౌతిక వాదం ఉంది అనేది వీరి ఆలోచన. ఏది ఏమైనా విశ్వం అనేది ఒక మాయ లోకం అది అందరూ భావించ వలసిందే.ఆ మాయ లోకంలో మానవులందరూ పావులు. మాయ లోకానికి అనుగుణంగానే మానవులు నడచుకుంటారు.

**- కనుమ ఎల్లారెడ్డి.**

# తెర

# 'దూరదర్శని' అందరి మనసులను హత్తుకుంటుంది: కార్తికేయ కొమ్మి



సువిక్షిత్, గీతికా రతన్ జంటగా ఓ యదార్థ సంఘటన ఆధారంగా రూపొందు తోన్న ఫీల్‌గుడ్ లవ్ ఎంటర్‌టైనర్ 'దూరదర్శిని'. కలిపింది ఇద్దరిని ఉపశీర్షిక. కార్తికేయ కొమ్మి దర్శకత్వంలో వారాహ మూవీ మేకర్స్ పతాకంపై జయ శంకర్ రెడ్డి.ఎం, పాటిమీది సంతోష్ ఈ చిత్రాన్ని నిర్మించారు. అన్ని పనులను పూరి చేసుకున్న ఈ చిత్రం మే 15న విడుదల కాబోతుంది.

**మీ నేపథ్యం ఏమిటి?**
ఇంతకు ముందు నేను సాధ్యం, వసూల్ రాజా, లక్ష్మీబాంబ్ సినిమాలకు దర్శకత్వం చేశాను. నేను కొత్తవాళ్లతో చేసిన తొలి ప్రాజెక్ట్ ఇది.

**దూరదర్శని కథ ఏమిటి?**
కథగా చెప్పుకుంటే పేరెంట్స్ చాయిస్, సొసైటీ చాయిస్, పిల్లల చాయిస్.. వీటి మధ్య ఉండే క్లాష్.. ఈ చిత్ర కథాంశం. చిత్రలహరి టైమ్ పిరియడ్ మిస్ అయిన వారికి. ఆ టైమ్‌లో చిత్రలహరి అనుభూతిని పొందిన వారికి ఈ సినిమా పూర్తి సంతృప్తి నిస్తుంది. చిత్రలహరి గురించి అందరూ ఎలా వెయిట్ చేసే వారు.. **ఇటీవల తిమ్మరాజు పల్లి టీవీకి అనే సినిమా వచ్చింది ఆ సినిమాతో ఏమైనా పోలికలు ఉంటాయా?**
కథ విషయంలో ఆ సినిమాకు ఈ సినిమాకు సంబంధం లేదు. ఇది కంప్లీట్ ఎమోషన్ సినిమా. ఫాదర్, సన్‌కు మధ్య ఉన్న ఎమోషన్.. ఈ సినిమాలోని ప్రతి సన్నివేశం మీ హృదయాలకు హత్తుకుంటుంది.

**అరుణాచలంలో బిక్షాటన చేస్తున్న ఓ వ్యక్తి జీవిత కథ ఈ సినిమా అంటున్నారు?**
ఆంధ్రా లో జరిగిన ఒక రియాల్ ఇన్‌సిడెంట్ ఇది. ఇప్పుడు ఆ వ్యక్తి అతను అరుణాచలంలో ఉన్నాడు. అతని జీవితంలో జరిగిన కథను స్ఫూర్తిగా తీసుకుని ఈ కథను తయారుచేశాం. ఆయనతో మాట్లాడినప్పుడు ఆయన చెప్పిన లైఫ్ స్టోరియే సినిమా ఇది. ఆయన సొంత కొడుకు వల్ల ఆ పెద్దాయన బిక్షాటన చేయాల్సి న పరిస్థితి ఎందుకు వచ్చింది అనేది ఈ కథ. యదార్థ సంఘటన చుట్టు అల్లుకున్న కథ ఇది.

**సాధారణంగా ఇలాంటి లవ్‌స్టోరీస్‌కు పతాక సన్నివేశాలు హైలైట్ అవుతుంటాయి? ఈసినిమాలో పతాక సన్నివేశాలు ఎలా ఉంటాయి?**
ఈ సినిమా పతాక సన్నివేశాలు అందర్ని ఆలోచింపజేస్తాయి. సినిమా చూసిన వచ్చిన తరువాత ఆ ఫీల్ మిమ్ములను వదిలివెళ్లదుఖి అన్నారు.అందరూ ఓ మంచి సినిమా చూశామన్న అనుభూతితో థియేటర్ నుంచి బయటికొస్తారు.

**హీరో, హీరోయిన్ చనిపోతారని చెప్పారు. ఎందుకని? ఇలా చెబితే సినిమాపై ఆసక్తి తగ్గుతుంది కదా?**
స్క్రీన్‌ప్లేలో ఉండే మ్యాజిక్ ఇది. ఫైనల్‌గా ఎలా హ్యాపీ ఎండింగ్ అనేది ఉంటుంది. ఓవరాల్‌గా తల్లిదండ్రుల ఎమోషన్ బాగా కనెక్ట్ అవుతుంది.

**హీరో, హీరోయిన్ పర్ఫార్మెన్స్ ఎలా ఉంటుంది?**
కొత్తవాళ్లతో చేసే అవకాశం రావడం థ్రిల్లింగ్‌గా అనిపించింది. ఈ మూవీకి హీరో, హీరోయిన్ పర్ఫార్మెన్స్ హైలైట్‌గా ఉంటుంది. వాళ్ల నటనతో సినిమాను మరో మెట్టు ఎక్కించారు.

**మీ తదుపరి చిత్రం?**
ఆగస్టులో ఓ పెద్ద ప్రాజెక్ట్‌కు దర్శకత్వం వహించబోతున్నాను

# "SYSTEM" ట్రైలర్ విడుదల



ప్రైమ్ వీడియో తమ కొత్త ప్రైమ్ ఒరిజినల్ సినిమా"SYSTEM"ట్రైలర్‌ను విడుదల చేసింది. కోర్ట్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమాలో పవర్, న్యాయం మధ్య జరిగే పోరాటాన్ని ఆసక్తికరంగా చూపించారు. ఈ చిత్రానికి అశ్విని అయ్యర్ తివారి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో సోనాక్షి సిన్హా, జ్యోతిక, అశుతోష్ గోవరికేర్ ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ సినిమా మే 22 నుంచి ప్రైమ్ వీడియోలో మన దేశంతో పాటు ప్రపంచవ్యాప్తంగా 240కి పైగా దేశాల్లో స్ట్రీమింగ్ కానుంది. ట్రైలర్‌లో నేహా అనే యువ లాయర్ పాత్రలో సోనాక్షి సిన్హా కనిపించారు. తన తండ్రిలా ఫర్మ్‌లో పార్ట్నర్ కావాలని ఆశపడే ఆమె, తన ప్రతిభను నిరూపించు కోవడానికి ప్రయత్నిస్తుంది. ఈ క్రమంలో కోర్ట్ స్టెనోగ్రాఫర్ సారిక పాత్రలో నటించిన జ్యోతికతో కలిసి పని చేస్తుంది. అయితే సారికకు కొన్ని గోప్యమైన ఉద్దేశాలు కూడా ఉంటాయి. కోర్ట్ సన్నివేశాలు, భావోద్వేగాలు, ఆలోచింపజేసే డైలాగు లతో ట్రైలర్ ఆకట్టుకుంటోంది."పవర్ ముందు నిజం నిలబడగలదా? న్యాయం గెలుస్తుందా?" అనే ప్రశ్నను సినిమా ప్రధానంగా చూపించబోతోంది. దర్శకురాలు అశ్విని అయ్యర్ తివారి మాట్లాడుతూ, నిజ జీవితానికి దగ్గరగా ఉండే కథతో ఈ సినిమా రూపొందిందని తెలిపారు. అలాగే సోనాక్షి సిన్హా జ్యోతిక ఈ చిత్రం తమ నటనకు కొత్త సవాల్‌గా నిలిచిందని చెప్పారు. ప్రేక్షకులను ఆలోచింపజేసే కథలను ప్రపంచవ్యాప్తంగా తీసుకెళ్లడంలో ప్రైమ్ వీడియో మంచి వేదిక అని ఆమె అభిప్రాయపడ్డారు.

# రిలీజ్‌కు సిద్ధమైన 'ఆర్ కే దీక్ష'



ఆర్ కె ఫిలిమ్స్, సిగ్ధ క్రియేషన్స్ బ్యానర్‌లపై డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ దర్శకత్వం వహించి నిర్మించిన చిత్రం 'ఆర్ కే దీక్ష'. డి.ఎస్ రెడ్డి సమర్పణ లో రూపొందిన ఈ చిత్రంలో ఢీ, జోడి ఫేమ్ అక్స ఖాన్, అలేఖ్య రెడ్డి హీరోయిన్లుగా నటించగా, కిరణ్ హీరోగా కనిపించనున్నారు. తులసి, అనూష, కీర్తన, ప్రవల్లిక, రోహిత్ శర్మ తదితరులు కీలక పాత్రలు పోషించారు. తాజాగా ఈ సినిమా సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకుని జూన్ 12న గ్రాండ్ థియే ట్రికల్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ ప్రెస్ మీట్ నిర్వహించింది. దర్శక నిర్మాత డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ మా 'ఆర్ కే దీక్ష' సినిమా సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. యాక్షన్ సన్నివేశాలు ఎక్కువగా ఉండటంతో సెన్సార్ వారు 'ఏ' సర్టిఫికెట్ జారీ చేశారు. పెద్దగా కట్స్ లేకుండా సర్టిఫికెట్ ఇచ్చిన అధికారులకు ధన్యవాదాలు. ఈ సినిమా చాలా బాగా వచ్చింది.అక్స ఖాన్ ఈ చిత్రంలో డ్యాన్సర్ పాత్రలో కనిపిస్తుంది. ఆమెపై తెరకెక్కించిన 'నంది నంది' పాట ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. రోహిత్ శర్మ నెగిటివ్ రోల్‌లో నటించారు. హీరో కిరణ్ మాట్లాడుతూ - నేను ఇప్పటికే పలు చిత్రాల్లో నటించాను. ప్రస్తుతం మూడు పాన్ ఇండియా సినిమాలు చేస్తున్నాను.

# 'వీరభద్రుడు' మే 14న రిలీజ్



'వీరభద్రుడు' థియేటర్స్ లో ఆడియన్స్ ఎంజాయ్ చేస్తారు: ప్రీరిలీజ్ ఈవెంట్‌లో హీరో సూర్య అన్నారు. 'వీరభద్రుడు' లాంటి క్యారెక్టర్‌ను అన్నయ్య మాత్రమే చేయగలరు. ఇలాంటి సినిమాలు థియేటర్‌లోనే చూడాలి హీరో కార్తి తెలిపారు. సూర్య మాగ్నమోపస్ మాస్ కమర్షియల్ ఎంటర్‌టైనర్ 'వీరభద్రుడు' త్రిష హీరోయిన్‌గా నటిస్తోంది. ఆర్జే బాలాజీ దర్శకత్వం వహిస్తున్న ఈ మోస్ట్ ఎవైటెడ్ మూవీని అనేక విజయవంతమైన చిత్రాలను నిర్మించడం ద్వారా పేరును తెచ్చుకున్న నిర్మాణ సంస్థ డ్రీమ్ వారియర్ పిక్చర్స్ ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తోంది. మే 14న ఈ చిత్రాన్ని వరల్డ్ వైడ్ గ్రాండ్‌గా రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ గ్రాండ్‌గా ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ ఈవెంట్‌లో హీరో కార్తి, డైరెక్టర్ వెంకీ అట్లూరి, నిర్మాత సుప్రియా యార్లగడ్డ పాల్గొన్నారు. ప్రీరిలీజ్ ఈవెంట్‌లో హీరో సూర్య మాట్లాడుతూ.. నేను ఇక్కడికి వచ్చిన ప్రతిసారి చాలా అదృష్టవంతుడిగా భావిస్తాను. నాకు తెలుగు అంత బాగా రాకపోవచ్చు.. కానీ తెలుగు వారి మనసు మాత్రం నాకు బాగా తెలుసు. సుప్రియతో మాకు ఎప్పటినుంచో చాలా మంచి స్నేహం ఉంది. అన్నపూర్ణ స్టూడియోస్ ఈ సినిమాను రిలీజ్ చేయడం చాలా గౌరవంగా భావిస్తున్నాం. హీరో కార్తీ మాట్లాడుతూ.. మీ ప్రేమకి హృదయపూర్వక కృతజ్ఞతలు. షూటింగ్ జరుగుతుండగా ఇక్కడ రోలెక్స్ ఉన్నారని చెప్పారు. డైరెక్టర్ వెంకీ అట్లూరి మాట్లాడుతూ.. ఒక డివైన్ ఎలిమెంట్‌తో పాటు సోషల్ యాంగిల్‌ను అద్భుతంగా మిక్స్ చేసి ఆర్.జే. బాలాజీ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు

# 'రమణి కళ్యాణం' టీజర్ లాంచ్



సూర్య వశిష్ట, దీప్షిక హీరో హీరోయిన్స్‌గా విజయ్ ఆదిరెడ్డి దర్శకత్వంలో రూపొందిన ఎమోషనల్ డ్రామా రమణి కళ్యాణం. కైట్స్ క్రియేటివ్స్ బ్యానర్ పై విజయ్ ఆదిరెడ్డి, మనోజ్ చింతిరెడ్డి. శ్రీనాథ్ పసుపు లేటి, సంజయ్ వెంపరాల నిర్మిస్తు న్నారు. కోర్ట్ మూవీ ఫేం రామ్ జగదీష్ డైలాగ్స్ స్క్రీన్ ప్లే అందిస్తున్నారు. ఈ సినిమా టీజర్ ని సహజనటి జయసుధ లాంచ్ చేశారు.టీజర్ లాంచ్ ఈవెంట్‌లో సహజనటి జయసుధ మాట్లాడుతూ..అందరికీ నమస్కారం. ఈ సినిమా నిర్మించిన నిర్మాతలకు అభినందనలు. ఈ సినిమాలో హీరో, హీరోయిన్‌లు అద్భుతంగా నటించారు. విజయ్ చాలా ప్యాషన్‌తో ఈ సినిమాను తీశాడు. ఇది ఒక బ్యూటిఫుల్ ఫిల్మ్. ఈ మధ్యకాలంలో చిన్న సినిమాల్లో కూడా చాలా మంచి సినిమాలు వస్తున్నాయి."రమణి కళ్యాణం కూడా అలాంటి మంచి సినిమా. హీరో, హీరోయిన్‌లు చాలా నేచురల్‌గా పెర్ఫార్మ్ చేశారు. మ్యూజిక్ కూడా చాలా అద్భుతంగా వచ్చింది. నేను ఈ సినిమా చూశాను. ఇది ఒక మంచి ఫీల్‌గుడ్ మూవీ. మే 22న ఈ సినిమా విడుదల అవుతోంది. అందరూ థియేటర్స్‌లో చూసి సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నాను, హీరో సూర్య వశిష్ట మాట్లాడుతూ.. రమణి కళ్యాణం అనే టైటిల్‌లోనే మంచి పాజిటివ్ ఎనర్జీ ఉంది. ఇలాంటి కథలు చాలా అరుదుగా వస్తాయి. మా డైరెక్టర్ ఈ సినిమాను ప్రాణం పెట్టి చేశారు.హీరోయిన్ దీప్షిక చంద్రన్ మాట్లాడుతూ..ఈ సినిమా మే 22న థియేటర్స్‌లోకి వస్తోంది. ఇది ఒక అద్భుతమైన కథ. ఇందులో చూపులేని అమ్మాయి పాత్రలో కనిపిస్తాను. అది సవాల్ తో కూడుకున్న పాత్ర. ఈ సినిమాలో భాగమైనందుకు చాలా ఆనందంగా ఉంది. డైరెక్టర్ విజయ్ ఆదిరెడ్డి మాట్లాడుతూ.. . ఇది మంచి టీమ్ సపోర్ట్‌తో చేసిన సినిమా. ఈ కథను నమ్మి పనిచేసిన అందరికీ థ్యాంక్స్.

# జూన్ 19న వస్తున్న 'బాలన్ ది బాయ్'




గ్రాండియర్ ఫిలిం మేకింగ్‌కు మారుపేరైన కేవీఎన్ ప్రొడక్షన్స్, తెస్పియన్ ఫిలింస్ సంయుక్తంగా నిర్మిస్తున్న సినిమా "బాలన్ ది బాయ్". ఈ చిత్రానికి "ఆవేశం" ఫేమ్ డైరెక్టర్ జితూ మాధవన్ అందించిన స్క్రిప్ట్‌తో "మంజుమ్మెల్ బాయ్స్" చిత్ర దర్శకుడు చిదంబరం దర్శకత్వం వహిస్తున్నారు. వెంకట్ కె నారాయణ, శైలజా దేశాయి ఫెన్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఈ రోజు ఈ సినిమా రిలీజ్ డేట్ ను మేకర్స్ అఫీషియల్ గా అనౌన్స్ చేశారు. జూన్ 19న హిందీతో పాటు మలయాళం, తెలుగు, కన్నడ, తమిళంలో "బాలన్ ది బాయ్" చిత్రాన్ని గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు తీసుకొస్తున్నట్లు ప్రకటించారు.'బాలన్ ది బాయ్' సినిమా ప్రఖ్యాత కేన్స్ ఫిలిం ఫెస్టివల్ లో ప్రదర్శితం కానుంది. ఈ నెల 14న కేన్స్ ఫిలిం ఫెస్టివల్ బిజినెస్ వింగ్ అయిన మార్ష్ డు ఫిలింలో "బాలన్ ది బాయ్ " స్క్రీనింగ్ జరగనుంది. గ్లోబల్ సినిమాకు వేదికైన కేన్స్ స్క్రీనింగ్ కు ముందే మేకర్స్ ఈ చిత్ర విడుదల తేదీని ప్రకటించడం విశేషం. మన నేటివిటీతో సాగే కథా కథనాలతో యూనివర్సల్ గా ప్రతి ఆడియెన్ మనసును హత్తుకునే భావోద్వేగాలతో ఈ చిత్రాన్ని దర్శకుడు చిదంబరం తెరకెక్కిస్తున్నారు. థియేటర్స్‌లో తప్పక చూడాల్సి న చిత్రమిది అంటూ మేకర్స్ కాన్ఫిడెంట్‌గా చెబుతున్నారు.

## జడ్పి డిప్యూటీ సీఈఓ మల్లికార్జునకి సమస్యల పరిష్కారం కోసం ధర్నా నోటీస్

అనంతపురం న్యూటౌన్, మే 12 ప్రభాతవార్త



జడ్పి డిప్యూటీ సీఈఓకి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అశోక్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి పాతి రెడ్డి, అనంతపురం జిల్లా అధ్యక్షులు నరేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి మోహన్ రెడ్డి, రాష్ట్ర జీవోల కమిటీ కన్వీనర్ గురురాజలు జడ్పీ డిప్యూటీ సీఈఓ మల్లికార్జునకి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు తెలియజేస్తూ.. ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలను 2025 -26 సంవత్సరం వరకు అప్డేట్ చేయాలని, అసంపూర్ణంగా జమ చేసిన డిఏ బకాయిలను సంపూర్ణంగా వ్యక్తిగత ఖాతాలలో జమ చేయాలని, సమస్యకు పరిష్కారం చూపకపోతే ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం నిర్వహిస్తామని ధర్నా నోటీసు అందజేశారు.

## జనాభా ప్రకారం బిసిలకు 40 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

### - రాష్ట్ర నాయీబ్రాహ్మణ డైరెక్టర్ ఎం.ఆదినారాయణ

శింగనమల, మే 12 ప్రభాతవార్త

జనాభా ప్రకారం రాష్ట్రంలో బిసిలకు 40 శాతం రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర ఎపినాయీబ్రాహ్మణ సంక్షేమ అభివృద్ధి కార్పోరేషన్ డైరెక్టర్ ఎం.ఆదినారాయణ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రాకు ఆయన వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆదినారాయణ మాట్లాడుతూ.. గ్రామ పంచాయితీలు, మున్సిపాలిటీలలో బిసిలు కేవలం ఓటర్లుగానే కాకుండా నిర్ణయాధికారులుగా ఎదగడానికి రిజర్వేషన్లు ఎంతో అవసరం అన్నారు. బిసిల్లో అత్యంత వెనుకబడిన వర్గంగా ఉన్న నాయీబ్రాహ్మణులకు ఈ 40 శాతం కోటాలో జనాభా దామాషా ప్రకారం ప్రత్యేక సబ్ కోటా లేదా ప్రథమ ప్రాధాన్యత కల్పించాలన్నారు. కేవలం వార్డు మెంబర్లుగానే కాకుండా సర్పంచులు, మున్సిపల్ చైర్మన్, మేయర్లు, జడ్పి చైర్మన్లు వంటి అత్యున్నత స్థానిక పదవులను నాయీబ్రాహ్మణ సామాజిక వర్గానికి రిజర్వ్ చేయాల న్నారు. రాష్ట్రంలో శాస్త్రీయంగా కుల గణన పూర్తి చేసి నాయీబ్రాహ్మణుల వాస్తవ లెక్కలను బహిర్గతం చేయాలని కోరారు. ఆ సంఖ్యకు అనుగుణంగా ఏపి పండలాల్లో మున్సిపాలిటీల్లో వారికి సీట్లు కేటాయించాలో, బిసి డెడికేటెడ్ కమిషన్ ద్వారా స్పష్టమైన మ్యాపింగ్ చేయాలన్నారు. ప్రభుత్వం కేవలం హామీలకు పరిమితం కాకుండా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే నాటికి ఈ 40 శాతం బిసి రిజర్వేషన్ల పెంపును నాయీబ్రాహ్మణులకు ప్రాధాన్యత ఇచ్చే విధానాన్ని అసెంబ్లీలో తీర్మాణం చేసి చట్టబద్ధత చేయాలన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

### - జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డా.జి.కవిత

శింగనమల, మే 12 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2026-2027 విద్యాసంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.జి.కవిత తెలిపారు. మంగళవారం ఆమె పత్రికా ప్రకటన విడుదల చేస్తూ కళాశాలలో రెండు విద్యార్సులు సిఈసి, హెచ్ఈసిలు అందుబాటులో ఉన్నాయన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు ఉద్యోగ అవకాశాలకు దోహదపడే విధంగా శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. గత 2025-26 విద్యా సంవత్సరంలో శింగనమల జూనియర్ కళాశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబర్చారని, ఎ.పూజిత 962 మార్కులు సాధించడం గర్వకారణమని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ఈ విజయాలు, అధ్యాపకుల కృషి, విద్యార్థుల పట్టుదల ఫలితమని ఆమె అభిప్రాయ పడ్డారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు కళాశాలకు వచ్చి దరఖాస్తు ఫారం తీసుకుని వెంటనే అడ్మిషన్ పొందాలని ప్రిన్సిపాల్ కోరారు.

## మండల వ్యాప్తంగా ఘనంగా హనుమాన్ జయంతి ఉత్సవాలు



: ప్రత్యేక అలంకరణలో హనుమంతుడు



బహుమతి ప్రధానం చేస్తున్న అట్టె ధనుంజయ

శింగనమల, మే 12 ప్రభాతవార్త

మండల వ్యాప్తంగా మంగళవారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి గ్రామంలోనూ హనుమాన్ దేవాలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి వచ్చిన భక్తాదులకు తీర్థప్రసాదాలు, అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని పెద్ద జలాలపురం గ్రామంలో నిర్వహించిన ఇరుసు పందెం, గుండు ఎత్తే పందెం విజేతలకు టిడిపి యూత్ నాయకుడు అట్టె ధనుంజయ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాళ్ల సత్యమూర్తి, కల్లుమడి సురేష్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఎంసిఎ అండర్-16 శిక్షణ ప్రారంభం

అనంతపురం సిటీ, మే 12 ప్రభాతవార్త



శిక్షణ పొందు తున్న క్రీడా కారులు

బిసిసిఐ, ఏసిఏ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఎన్‌సిఏ అండర్-16 శిక్షణ కార్యక్రమం ఆర్డిటిలో ప్రారంభమైంది. అనంతపురం స్పోర్ట్స్ అకాడమిలో మే 11 నుంచి జూన్ 6 వరకు నిర్వహించనున్న శిక్షణ శిభిరంలో పాల్గొనేందుకు దేశ వ్యాప్తంగా 25 మంది క్రీడాకారులు ఆర్డిటి శిభిరానికి చేరుకున్నారు. రెండు రోజులపాటు వీరికి ఫిట్‌నెస్, మెడికల్ పరీక్షలను నిర్వహించనున్నారు. క్రీడా కారులతోపాటు కోచ్‌లు, ఇతరాత్ర సిబ్బంది సైతం హాజరయ్యారు.

## కిషోర్ బాలికలకు మంచి పౌష్టికాహారాన్ని అందించండి !

రాప్తాడు, మే 12 ప్రభాతవార్త



అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

ప్రాజెక్ట్ డైరెక్టర్ డి శశికళ ఆదేశాల మేరకు మంగళవారం మండల కేంద్రంలోని మూడవ అంగన్వాడీలో కిషోర్ వికాసము వేసవి శిక్షణ కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్ర మాన్ని నిర్వహించారు. ప్రోగ్రాంలో భాగంగా కిషోర్ బాలబా లికలందరినీ సమావేశపరిచి తీసుకోవల సిన జాగ్రత్తలు మంచి పౌష్టికాహారాన్ని, ఎక్కువగా మజ్జిగ, నీరు తీసుకోవాలి, ప్రతిరోజు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలి, ఇంటి చుట్టుపక్కల కూడా పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలి, బయట దొరికే జంక్ ఫుడ్స్‌ని తీసుకోకూడదు, అదేవిధంగా మీ మీ పనులు ఏమైనా ఉన్నా కూడా ఉదయం 11లోపలే ముగించుకొని మరల నీడపాటిలో ఉంటూ తగిన జాగ్రత్తలు తీసుకొని నాలుగు గంటల తర్వాతనే బయటికి రావాలని తెలియజేయజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు చైల్డ్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఉమా శంకరమ్మ, డిస్టిక్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ మంజునాథ్, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 కోఆర్డినేటర్ కృష్ణమాచారి, అలాగే కేస్ వర్కర్స్ ఇర్ఫాన్, నిర్మల, ఐసిడిఎస్ సూపర్వైజర్ లీలావతి మహిళా సంరక్షణ కార్యదర్శిలు మల్లేశ్వరి, సరిత, ఏఎన్ఎం రామాంజనమ్మ, అంగన్వాడి టీచర్ లలితమ్మ, సావిత్రి, విజయలక్ష్మి, లక్ష్మిదేవి ముత్యాలమ్మ పాల్గొన్నారు.

# గుత్తి రామకృష్ణ చిరస్మర నీయులు

అనంతపురం కల్చరల్, మే 12 ప్రభాతవార్త



కామ్రేడ్ గుత్తి రామకృష్ణ వర్ధంతి నిర్వహిస్తున్న దృశ్యం

ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు, సాహితీవేత్త, పాత్రికేయులు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతిని కోరిన కమ్యూనిస్టు నాయకుడు కామ్రేడ్ గుత్తి రామకృష్ణ చిరస్మనీయులు అని విశ్రాంత సంయుక్త కలెక్టర్ దాసరి గోవిందరాజులు అన్నారు. మంగళవారం కామ్రేడ్ గుత్తి రామకృష్ణ 17వ వర్ధంతి సందర్భంగా స్థానిక విశాలాంధ్ర బుక్ హౌస్ ప్రాంగణంలో తెలుగు వెలుగు సాహిత్య సామాజిక సేవ సంస్థ, సాహితి మిత్రుల ఆధ్వర్యం లో తెలుగు వెలుగు టీవీ రెడ్డి అధ్యక్షతన గుత్తిరామకృష్ణ చిత్రపటానికి పూల మాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అకడమిక్ కన్సల్టెంట్ డాక్టర్ నానీల నాగేంద్ర మాట్లాడుతూ..గుత్తి రామకృష్ణ గొప్ప నిడారంబర జీవితం గడిపిన ప్రజల మనిషిగా పేరుపొందారు. ఆయనకు చిన్నతనము నుండే పుస్తక పఠనం ఇష్టపడేవారు కందుకూరి వీరేశలింగంని స్ఫూర్తిగా తీసుకొని అనేక పుస్తకాలు చదువుతూ అదే క్రమంలో బ్రిటిష్ వారిపై ద్వేషాన్ని పెంచుకున్నారు. ఆ విధంగా స్వాతంత్ర పోరాటంలో పాలుపంచుకొని జైలు జీవితం గడిపారు. ఆయన రాసింది 6 కథలే అయినా రాయలసీమ కరువుపై రాసిన గంజి కోసం కథ రాయలసీమ కథగా ప్రసిద్ధి చెందింది. 1947 అనంతపురం లో కృష్ణా బుక్స్టాల్ ప్రారం భించాడు. పాత్రికేయులుగా ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి చేస్తూనే ప్రజల పక్షం వహిం చారు. ఆయన చివరి నిమిషం వరకు ప్రజా సమస్యలపై స్పందిస్తూ చర్చించేవారు. ఆయన కృషిని అనం తపురం ప్రజలు మరువలేని అన్నారు. ఈ కార్యక్ర మంలో మధురశ్రీ, రియాజ్ అహమ్మద్, డాక్టర్ గాజుల వెం కటసుబ్బయ్య, విజయ భాస్కర్ రెడ్డి, పూజారి ఈరన్న, విశా లాంధ్ర జయరాములు, సత్యం, చెట్ల ప్రవీణ్ పాటిల్ హరీష్ కు మార్ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల సమస్యలపై అనంతపురం ఎస్పీ జగదీష్‌ని కలిసిన దివ్యాంగ సంఘాలు

అనంతపురం న్యూటౌన్, మే 12 ప్రభాతవార్త



ఎస్పీకి సమస్యలను వివరిస్తున్న దివ్యాంగుల సంఘాల నేతలు

అనంతపురం జిల్లా వ్యాప్తంగా దివ్యాంగులపై దాడులు, దౌర్జన్యాలు, బెదిరింపులు మహిళ దివ్యాంగులపై అత్యాచారాలు ఎక్కువవుతున్న నేపథ్యంలో ఎస్పీని ప్రత్యేకంగా కలిసి సమస్యలను వివరించినట్లు ఆ సంఘం నేతలు తెలియజేశారు. 2016 దివ్యాంగుల హక్కుల చట్టం 92 సెక్షన్ ఎఫ్ఐఆర్ కట్టే విధంగా అన్ని పోలీస్‌స్టేషన్లకి తెలియజేయాలని కోరారు. అనంతపురం మున్నా నగర్ కాలనీకి చెందిన శారీరక దివ్యంగుడు షాషా వలి పై ఆరు నెలల నుంచి ఆ వీధిలో ఉన్న కొంతమంది అతనితో వికలాంగత్వం పేరుతో దూషించి దాడులు కూడా చేయడం జరిగింది. వెంటనే స్పందించిన ఎస్పీ వన్ టౌన్ సిఐ వెంకటేశ్వర్లుతో మాట్లాడి వెంటనే ఎఫ్ఐఆర్ కట్టించడం జరిగింది. అదేవిధంగా కళ్యాణ దుర్గం ప్రాంతానికి చెందిన మహిళ అందురాలు తిప్పమ్మ మీద వాళ్ల చిన్నాన్న దాడి చేయడం జరిగింది. స్పందించిన ఎస్పీ కళ్యాణ దుర్గం ఎస్పైకి ఫోన్ చేసి వెంటనే వాళ్లపైన బైండోవర్ చేసి ఎఫ్ఐఆర్ కట్టమని చెప్పడం జరిగింది. అనంతపురం జిల్లా వ్యాప్తంగా దివ్యాంగులు ఎవరైనా సరే ఏ సమస్య ఉన్నా చట్ట పరంగా బాధితుల పక్షాన నిలబడి దివ్యాంగుల హక్కుల చట్టం 2016 ప్రకారం 92 సెక్షన్ ఎఫ్ఐఆర్ కట్టే విధంగా అన్ని పోలీస్ స్టేషన్‌లకి నోటీసులు పంపిస్తామని ఎస్పీ హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు హరినాథ్ రెడ్డి, జిల్లా కార్య దర్శి శేషావలి, సింగనమల నియోజ కవర్గం అధ్యక్షుడు నల్ల ప్ప, దివ్యాంగుల సహాయకు డు ప్రదీప్, వికలాంగుల హ క్కుల జాతీయ వేదిక అనం తపురం జిల్లా అధ్యక్షులు వసం త కుమార్, కళ్యాణ దుర్గం నియోజకవర్గ అధ్యక్షులు దొన స్వామి, తిప్పమ్మ ఇతర దివ్యాంగులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో బీసీ కుల జనగణనను నిక్కచ్చిగా సేకరించాలి

### - బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు భాస్కర్‌బాబు

అనంతపురం కల్చరల్, మే 12 ప్రభాతవార్త



వినతిపత్రం అందజేస్తున్న బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు భాస్కర్‌బాబు

రాష్ట్రంలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా బీసీల రిజర్వేషన్ల శాతాన్ని వారి జనాభా దామాషా ప్రకారం నిర్ణయించాలని, బీసీ కుల జనగణనను నిక్కచ్చిగా సేకరించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు భాస్కర్‌బాబు కోరారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని రెవెన్యూ భవనంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వెనకబడిన తరగతుల ఇండిపెండెంట్ డేడికేషన్ కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రాను కలిసిన బీసీ సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా భాస్కర్‌బాబు మాట్లాడుతూ..స్థానిక సంస్థల్లో బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించడానికి ఆటంకంగా ఉన్న 50 శాతం సీలింగును రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా ఎత్తివేయాలని, ఆ చట్టాన్ని 9వ షెడ్యూల్లో చేర్చాలని, ఆ విధంగా చట్టం తెచ్చేవిధంగా కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వంపై, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం తగు ఒత్తిడి తీసుకురావాలన్నారు. అదవిధంగా మండల్ కమిషన్ చేసిన సిఫారసు లన్నిటిని అమలు జరపాలని, బీసీల రిజర్వేషన్ల ఖరారు తరువాతనే రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సం ఘం రాష్ట్ర కార్యదర్శి సురేంద్ర గౌడ్, రాష్ట్ర సహాయ కార్యదర్శి డీకే రామలింగం, జిల్లా ప్రధాన కార్యదర్శి విష్ణు వర్ధన్ గౌడ్, జిల్లా యువజన అధ్యక్షులు మనోజ్ కుమార్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## ఇగ్నో నూతన విద్యార్థులకు అవగాహన కార్యక్రమం

అనంతపురం న్యూటౌన్, మే 12 ప్రభాతవార్త



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

స్థానిక ఎస్ఎస్‌బిఎన్ డీగ్రీ కళాశాలలో గల ఇందిరాగాంధి జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం అధ్యయన కేంద్రములో ఆదివారం 2026కు సెషన్‌కు అడ్మిషన్ పొందిన నూతన విద్యార్థులకు అవగాహన కార్యక్రమము ఫేస్ టు ఫేస్/వర్చువల్ మోడల్‌లో జరిగింది. ప్రాంతీయ కేంద్రం రీజినల్ డైరెక్టర్ డా.పి.శరత్ చంద్ర, అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ యం. మురళీమోహన్ రెడ్డి, అధ్యయన కేంద్రం అసిస్టెంట్ కోఆర్డినేటర్ దేవకీమణి, అకాడమిక్ కౌన్సిలర్స్, అధ్యయన కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు. నూతన విద్యార్థులను ఉద్దేశించి రీజినల్ డైరెక్టర్ డా.పి.శరత్ చంద్ర మాట్లాడుతూ.. దూరవిద్యా విధానములో ఐజిఎన్ఓయు దేశంలోనే ప్రథమ స్థానంలో ఉందని, ప్రపంచ వ్యాప్తంగా ఇతర దేశాలతో పాటు మన దేశంలో 3000 అధ్యయన కేంద్రాలు ఉన్నాయని, ఈ కేంద్రాల ద్వారా 7.5 లక్షల మంది ప్రతి సం వత్సరం విద్య నభ్యసిస్తున్నారని తెలిపారు. నూతన విద్యార్థులకు ఐజిఎన్ఓ యుకు సంబంధించిన బోధన, అసైన్మెంట్, పరీక్షల విధానాల గురించి అధ్యయన కేంద్రము కోఆర్డినేటర్ మురళీ మోహన్‌రెడ్డి, అధ్యయన కేంద్రం అసిస్టె ంట్ కోఆర్డినేటర్ దేవకీమణి వివరించారు. అనంతరం విద్యార్థులు అడి గిన ప్రశ్నలకు, సందేహాలకు రీజినల్ డైరెక్టర్ శరత్ చంద్ర, యం.మురళీమోహన్ రెడ్డి, కే.దేవకీమణి సమాధానాలిచ్చారు.

## నీట్ పరీక్షా లీకేజ్‌కు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలి

### - ఏఐఎస్ఎఫ్ అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయిస్వామి

అనంతపురం న్యూటౌన్, మే 12 ప్రభాతవార్త



ఏఐఎస్ఎఫ్ అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయి స్వామి

దేశవ్యాప్తంగా మే 4వ తేదీన జరిగినటువంటి నీట్ ప్రవేశ పరీక్షలలో 20 లక్షలకుపైగా రాశారు. ఈరోజు పేపర్ లీకేజ్ జరిగిందని పరీక్షను రద్దు చేయడం జరిగింది. దీనికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని ఏఐఎస్ఎఫ్ అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయి స్వామి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయి స్వామి మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా పేద మధ్య తరగతి విద్యార్థుల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం చెలగాటమాడుతుందని మండిపడ్డారు. తక్ష ణమే కేంద్ర ప్రభుత్వం స్పం దించి ఎన్‌టిఏ ఏజెన్సీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్ర మాలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## విభిన్న ప్రతిభావంతుల (దివ్యాంగులు) వసతి గృహాలలో ప్రవేశాలకు దరఖాస్తులకు ఆహ్వానం

అనంతపురం న్యూటౌన్, మే 12 ప్రభాతవార్త

అనంతపురము జిల్లాలోని విభిన్న ప్రతిభావంతుల, హిజ్రాల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 3వ తరగతి నుండి డిగ్రీ వరకు చదువుచున్న విభిన్న ప్రతిభావంతులైన శారీరక, బధిరుల, అంధుల బాలుర కొరకు హెచ్ఎల్‌సి కాలనీ, అనంతపురంలో 100 మందికి, విభిన్న ప్రతిభావంతులైన శారీరక, బధిరుల, అంధుల బాలికల కొరకు అరవింద నగర్, అనంతపురంలో 50 మంది సామర్ధంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున ప్రత్యేక వసతులతో వసతి గృహాలు నడుపబడుచున్నవి. వసతి గృహములలో 2026-27 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కొరకు అనంతపురం, శ్రీ సత్య సాయి జిల్లాలోని విద్యను అభ్యసిస్తున్న విభిన్న ప్రతిభావంతులు ధరఖాస్తు చేసుకోగలరని కోరడమైనది. ఈ గృహాలయందు ప్రవేశం పొందిన వారికి విభిన్న ప్రతిభావంతుల, హిజ్రాల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ద్వారా బాల, బాలికలకు విడివిడిగా ఉచిత వసతి, భోజనంతో పాటు దుస్తులు, నోట్ పుస్తకాలు, ట్రంకు పెట్టెలు, ప్లేటూ, గ్లాసు కాస్మోటిక్ ఛార్జీలు మొదలైనవి అందించబడును. మరిన్ని వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నంబర్స్ 7893577797, 9492760438 లేదా ఈ కార్యాలయపు పనివేళలలో, పని దినములలో 08554232380లో సంప్రదించాలని కోరారు.

## వెనుకబడిన తరగతుల ఇండిపెండెంట్ డెడికేటెడ్ కమిషన్‌కు వినతి

అనంతపురం న్యూటౌన్, మే 12 ప్రభాతవార్త



కమిషన్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

సగర యువసేన రాష్ట్ర అధ్యక్షులు సగర పవన్ కుమార్, శ్రీకాంత్ అధ్యక్షతన వెనుకబడిన తరగతుల ఇండిపెండెంట్ డెడికేటెడ్ కమిషన్‌కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సగర/ఉప్పర కులస్తుల సమస్యల గురించి వినతి పత్రం అందించారు. ఇండిపెండెంట్ డేడికేటెడ్ కమిషన్ చైర్మన్ గారికి సగర/ఉప్పర కులస్తుల సమస్యల గురించి వివరించి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వారు తెలియజేస్తూ..సగరులు జీవనవృత్తి పరంగా భవన నిర్మాణ కార్మికులుగా రోజువారి కూలీలుగా జీవనం సాగిస్తూ ఉండడం వల్ల వీరికి భవన నిర్మాణ రంగంలో ఈఎండి లేకుండా ప్రభుత్వ కాంట్రాక్టు పనులు ఇవ్వాల్సిందిగా కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో అనంతపురం సగర సంగం పెద్దలు సగర యువసేన ప్రధాన కార్యదర్శి సుకుమార్ ఉపాధ్యక్షులు విశ్వనాథ్ తరుణ్ రాము తదితరులు పాల్గొనడం జరిగింది.

## 15న చేపట్టిన గ్రామీణ సమ్మెను జయప్రదం చేయండి

పుట్లూరు, మే 12 ప్రభాతవార్త

ఈ నెల 15వతేదీన చేపట్టిన గ్రామీణ సమ్మెను జయప్రదం చేయాలని సిపిఐ, ఏపి రైతు సంఘం జిల్లా డిప్యూటి జనరల్ సెక్రటరీ పెద్దయ్య పేర్కొన్నారు. మంగళవారం పుట్లూరు మండలంలోని తక్కళ్లపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా పెద్దయ్య మాట్లాడుతూ పేదలకు పట్టెడన్నం పెట్టే ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసి పేదల నోట్లో మట్టి కొట్టేలా మోడీ ప్రభుత్వం విజి రామ్ జీ కొత్త బిల్లును ఎటువంటి ప్రజా చర్చ లేకుండా పార్లమెంటు ఉభయ సభల్లో మూజువాణి ఓటుతో ఆమోదించడం దారుణమన్నారు. ఈ కొత్త బిల్లు వలన ఉపాధి హామీ కూలీలకు తీవ్రం నష్టం తప్ప, ఒరిగేదేమీ ఉండదన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసి ఎత్తివేయాలని ఆలోచనలో కేంద్ర ప్రభుత్వం చూస్తోందన్నారు. పోరాటలతో సాధించుకున్న మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని యదావిధిగా కొనసాగిస్తూ కొత్త పథకాన్ని రద్దు చేయాలని ఈ నెల 15న గ్రామాల్లో ఆందోళనకు సిపిఐ, ఏపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పిలుపునివ్వడం జరిగిందన్నారు. ఉపాధి హామీ కూలీలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి బాలు, నడిపి నారాయణ, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి సురేంద్ర, వెంకటేష్, బాల ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.

## కన్నుల పండువగా సీతారాముల కళ్యాణోత్సవం

### - ఘనంగా హనుమాన్ జయంతి



.శ్రీ కోట వరాంజనేయస్వామి దేవాలయంలో సీతారాముల కళ్యాణోత్సవం



శ్రీ హనుమాన్ విగ్రహాన్ని పూజిస్తున్న దృశ్యం



ద్విచక్రవాహనాల ర్యాలీ చేపడుతున్న హిందూ సోదరులు.

పామిడి, మే 12 ప్రభాతవార్త

పట్టణంలోని శ్రీ కోట వరాంజనేయస్వామి దేవాలయంలో మంగళవారం దేవస్థానం కమిటీ అశేష భక్తుల జై శ్రీరామ్ నినాదాల మధ్య సీతారాముల కళ్యాణోత్సవాన్ని ఇల్లూరు విజయలక్ష్మి చితంబరయ్య కుటుంబ సభ్యులు భక్తిభావంతో కన్నుల పండువగా సాగింది. దేవస్థానం అర్చకులు శ్రీ సీతారా ముల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి వేద మంత్రాలను వల్లి స్తూ శాస్త్రోక్తంగా కళ్యాణోత్సవాన్ని చేపట్టారు. కళ్యాణోత్సవానికి విరివిగా తరలివచ్చిన భక్తులు ప్రత్యేక పూజలను నిర్వహించి స్వాముల వారి కృపకు పాత్రులయ్యారు. శ్రీ అనఘా ఆత్రేయ దత్త పాదుకా క్షేత్రం, శ్రీ పంచముఖ అంజనేయస్వామి, శ్రీ కోట వరాంజనేయస్వామి, గ్రామీణ ప్రాంతాల్లోని శ్రీ అంజనేయస్వాముల దేవాలయాల్లో హనుమాన్ జయంతోత్సవాలను అత్యంత ఘనంగా చేపట్టారు. వేకువజామున దేవాలయాలకు చేరుకున్న భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టి తీర్థప్రసాదాలను స్వీకరించారు. శ్రీ అనఘా ఆత్రేయ దత్త పాదుకా క్షేత్రంలో శ్రీ కార్యసిద్ధి ఆంజనేయస్వామికి విశేష పూజలు అభిషేకాలు అర్చనలు మహామంగళహారతి అనంతరం శ్రీశ్రీ గురుదత్త సేవా సమితి వారు హనుమాన్ చాలీసా సామూహిక పారాయణం పఠిం చారు. శ్రీ హనుమాన్ జయంతిని పురష్కరించుకుని హిందూ సోదరులంతా ద్విచక్రవాహనాల ర్యాలీని చేపట్టి పట్టణమంతా జై శ్రీరామ్.. రామ లక్ష్మణ జానకి.. జైబోలో హనుమాన్ నినాదాలతో హోరెత్తించారు.

## ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్ క్లాస్ లను సద్వినియోగం చేసుకోండి

### ఎస్ ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకులు సుంకర రమేష్

అనంతపురం వైద్యం మే 12 ప్రభాతవార్తఎస్సార్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిం చబోయే ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్ క్లాసులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్సార్ ఎడ్యుకేషనల్ సొసైటీ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు సుంకర రమేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సార్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో రేపటినుండి 30 రోజులపాటు ఉచితంగా స్పోకెన్ ఇంగ్లీష్ మరియు పబ్లిక్ స్పీకింగ్ పై ఆన్లైన్ ద్వారా తరగతులు నిర్వహిం చబడునని ఆసక్తిగల విద్యార్థులు ఇంగ్లీష్ భాష పై పట్టు సాధించడం మరియు పబ్లిక్ స్పీకింగ్ పై అవగాహన తరగతులు నిర్వహించబడునని ఈ సువర్ణ అవకాశాన్ని విద్యార్థులంతా వినియోగించుకోవాలని భవిష్యత్తు నందు ఇంగ్లీష్ భాష నందు పట్టు సాధించి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని నెల రోజులపాటు ఈ శిక్షణ తరగతుల నందు ఎటువంటి రుసుములు లేకుండా పూర్తిగా ఉచితంగా నిర్వహించబడును అని అనుభవజ్ఞులైన గురువులచే ఇంగ్లీష్ , పబ్లిక్ స్పీకర్ గురించి తర్ఫీదు ఇవ్వబడునని ఆసక్తిగల వారు దయచేసి ఈ కింది నెంబర్లకు 83094 86255,9059055965 ఫోన్ చేసి తమ పేర్లను నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

## మార్మోగిక ఆంజనేయ నామ స్మరపలు ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో పూజలు



ప్రత్యేక అలంకరణ లో దర్శనమిస్తున్న పంచముఖ ఆంజనేయస్వామి



కోర్టు రోడ్డు వద్ద ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం వైద్యం మే 12 ప్రభాతవార్త

తాము కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరు గడించిన హనుమంతుడి జయంతి వేడుకలు పలు ఆలయాల్లో ఘనంగా జరిగాయి అనంతవీధులు ఆంజనేయ నామస్మరణతో మారుమోగాయి. ఉదయం నుండి పలు ఆలయాలలో భక్తులు ఆంజనేయ స్వామి దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. భక్తులతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు సైతం పూజలో పాల్గొన్నారు సాయంత్రం వేడుకగా గ్రామోత్సవం నిర్వహించారు ప్రధానంగా హౌసింగ్ బోర్డు లోని ఆంజనేయస్వామి ఆలయం జీసస్ నగర్ లో ఉన్న పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం రామచంద్ర నగర్ లోని సీతారామాంజనేయ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు అలాగే కోర్ట్ రోడ్ లో ఉన్న భక్తాంజనేయ స్వామి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరారు.

## నకిలీ పత్తి విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవు

### - తాడిపత్రి ఏడిఏ రవి

తాడిపత్రిటౌన్, మే 12 ప్రభాతవార్త



ఫర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏడిఏ రవి

నకిలీ, లూజు పత్తి విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని తాడిపత్రి ఏడిఏ రవి హెచ్చరించారు. మంగళ వారం తాడిపత్రి మండలంలో విత్తన లైసెన్స్ కలిగి ఉన్న రైతు మిత్ర సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్, లలిత అగ్రో ట్రేడర్స్, ఏఎస్‌కేఆర్ ఫర్టిలైజర్స్, మహాలక్ష్మి ఆగ్రో ఏజెన్సీస్ షాపులను ఏడిఏ రవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు రైతులకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని షాపు యజమానులను ఆదేశించారు. బిల్లు లేకుండా విత్తనాలు అమ్మితే సంబంధిత షాపు యజమానిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గ్రామాల్లో లూజు పత్తి విత్తనాలు అమ్మితే చట్టరీత్యా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు. అలాంటి వారి సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. నకిలీ విత్తనాలు అమ్ముతున్న వారి గురించి తెలిస్తే 8331057680, 8331057613కు సమాచారం ఇవ్వాలన్నారు. రైతులు ఎల్లప్పుడూ ఆథరైజ్డ్ డీలర్ వద్దే విత్తనాలు కొనుగోలు చేసి రశీదు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ తనిఖీల్లో మండల వ్యవసాయాధికారి ఆంజనేయులు, టెక్నికల్ ఏఓ కిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

యల్లనూరు, మే 12 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని కోట వీధిలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే స్వామి వారికి అభిషేకాలు, ఆకుపూజలు, అర్చనలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. హాజరైన భక్తులకు ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకొని జంగంపల్లి గ్రామంలో గ్రామస్తులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

**CHANGE OF NAME**

, MANGALA JYOSHNA (Old Name) D/o Mangala Nagabhushanam, R/o. D.No:6-3-482,Ram Nagar,Anantapuramu City & Dist Andhra Pradesh. I Changed my Name to **MANGALA JOSHNA** Henceforth, I will be Known as **MANGALA JOSHNA (New Name)**

# దేవాలయాల్లో వరస చోరీలకు పాల్పడుతున్న కేసుల్లో నిందితుడు అరెస్ట్

## - సుమారు 27.5, గ్రాముల బంగారం - 380 గ్రాముల వెండి ఆభరణాలు - ఒక వెండి బిస్కెట్ సొత్తుతోపాటు ద్విచక్ర వాహనం స్వాధీనం - దేవాలయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటుతోపాటు కమిటీ సభ్యులు తగు జాగ్రత్త తీసుకోవాలి - మీడియాకు వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ



దొంగ నుంచి స్వాధీనం చేసుకున్న సొత్తును చూపుతున్న పోలీసులు



దొంగ అరెస్టు చూపుతున్న పోలీసులు

రామగిరి, మే 12 ప్రభాతవార్త

శ్రీ సత్య సాయి జిల్లాలో దేవాలయలను లక్ష్యంగా చేసుకుని వరుస దొంగతనాలు పోల్పడుతున్న దొంగను అరెస్ట్ చేసి బంగారు వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్ ఐపీఎస్ తెలియ జేశారు. మంగళవారం సాయంత్రం రామగిరి పోలీస్ స్టేషన్లో సీఐ ఎస్.ఎం. అలీతో కలిసి ఎస్పీ కేసు వివరాలను మీడియా సమావేశంలో వెల్లడించారు. జిల్లా ఎస్పీ సి.ఎస్. సతీష్ కుమార్ ఆదేశాల మేరకు శ్రీ సత్యసాయి జిల్లా పోలీసులు, రామగిరి పోలీస్ స్టేషన్ సిబ్బంది సంయుక్తంగా చేపట్టిన ప్రత్యేక దర్యాప్తులో రామగిరి, చెన్నేకొత్తపల్లి, కనగానపల్లి మండల పరిధిలో జరిగిన వరుస దేవాలయ చోరీల కేసులను ఛేదించి నేరస్థుడిని అరెస్ట్ చేశారు. అరెస్టు చేసిన నిందితుడు వడ్డే మర్రిస్వామి అలియాస్ సంకేత (45), అనంతపురం జిల్లా సెట్టూరు మండలం మాకోడీ గ్రామానికి చెందినవాడు. ప్రస్తుతం కర్ణాటక రాష్ట్రంలోని పావగడలో నివాసం ఉంటున్నాడు.

**కేసు దర్యాప్తు :** నిందితుడు మద్యం వ్యసనం, జూదపు అలవాట్లు మరియు ఆర్థిక అప్పుల కారణంగా దేవాలయ చోరీలకు పాల్పడినట్లు వెల్లడైంది. నిందితుడు భక్తుడి వేషంలో దేవాల యాలకు వెళ్లి, జనసంచారం తక్కువగా ఉండే ఆలయాలను గుర్తించి, రాత్రి సమయంలో ఇనుప రాడ్ల సహాయంతో తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించి చోరీలకు పాల్పడేవాడు. ముఖ్యంగా బంగారం, వెండి ఆభరణాలు, హుండీ నగదును లక్ష్యంగా చేసుకొని అపహరించేవాడు. దొంగిలించిన వెండి వస్తువులను కరిగించి వెండి బిస్కెట్లుగా మార్చి విక్రయించేందుకు ప్రయత్నిం చేవాడని పోలీసులు వెల్లడించారు. కర్ణాటక, అనంతపురం జిల్లాలో కూడా పలు దేవాలయాల్లో చోరీలకు పాల్పడిన కేసులలో కూడా నిందితుడుగా ఉన్నారని, సాంకేతిక ఆధారాలు, రాత్రి పహారా, వాహన తనిఖీలు మరియు శాస్త్రీయ దర్యాప్తు ఆధారంగా ఎస్ఐ టి.ప్రదీప్ రాజ్, ఎస్ఐ సత్యనారాయణ ఆధ్వర్యంలోని ప్రత్యేక పోలీసు బృందాలు నిందితుడిని అదుపులోకి తీసుకొని పలు దేవాలయ చోరీల కేసులతో సంబంధం ఉన్నట్లు నిర్ధారించాయి.

**నిందితుడి వద్ద నుంచి స్వాధీనం సొత్తు :** సుమారు 27.5, గ్రాముల బంగారు ఆభరణాలు, 380 గ్రాముల వెండి ఆభరణాలు, ఒక వెండి బిస్కెట్, చోరీలకు వినియోగించిన ఒక హీరో స్ప్లెండర్ ప్లస్ మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... జూదాలకు బానిసలై ఆర్థికంగా దెబ్బతిని చోరీలు చేసేందుకు కూడా సిద్ధమవుతున్నారని , ఇటువంటి వాటికి స్వస్తి ఫలకాలన్నారు. ఎక్కడైనా పేకాట ఆడుతుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని , ఏదైనా సంఘటన జరిగినప్పుడు వెంటనే ఆధారాలు సిసి ఫుటేజ్ లో రికార్డ్ అవుతాయని వాటి ద్వారా నిందితులను త్వరగా పట్టుకునేందుకు వీలవుతుందన్నారు. దేవాలయ కమిటీ సభ్యులకు ముఖ్య సూచనలు చేశారు. ఆలయాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం, బలమైన తాళాలు వినియోగించడం, రాత్రి వేళల్లో లో గుడి వద్ద కాపలాగా ఉంటూ కాపాడుకోవాల్సిన బాధ్యత అందరపై ఉందన్నారు. ముఖ్యంగా గుడికి వచ్చిన కానుకలు డబ్బులు బ్యాంకులో ఉంచే విధంగా చూడాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు 100/112 ద్వారా సమాచారం అందించాలని సూచించారు. కేసును విజయవంతంగా ఛేదించిన రామగిరి సర్కిల్ సిఐ ఎస్ఎం అలీ, ఎస్సైలు ప్రదీప్ రాజ్, సత్యనారాయణ పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ గారు అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీతో పాటు, సిఐ ఎస్.ఎం.అలీ, ఎస్సైలు ప్రదీప్ రాజ్ సత్యనారాయణ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# కృష్ణా,గోదావరి నదీ జలాల వినియోగంపై వచ్చిన వార్తలపై ప్రజలకు నిజాలు తెలియజేయాలి

## - ఆలోచనపరుల వేదిక రాష్ట్ర నాయకులు లక్ష్మినారాయణ

అనంతపురం, మే 12 ప్రభాతవార్త బ్యూరో

కృష్ణా, గోదావరి నదీ జలాల వినియోగం, ప్రాజెక్టుల సమస్యలకు సంబంధించి ప్రసారమాధ్యమాల్లో వచ్చిన వార్తలు ఆలోచనపరుల వేదిక రాష్ట్ర నాయకులు లక్ష్మినారాయణ ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన తెలియజేస్తూ.. ఆంధ్రప్రదేశ్‌కు అత్యంత హాని కలిగించే ప్రతిపాదనలను కేంద్ర జలశక్తి మంత్రి సాటిల్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ముందు పెట్టినట్లు వచ్చిన వార్తలు, వాస్తవమో! కాదో! రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి లేదా ఆ సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి వివరణ ఇవ్వాలని ఆలోచనాపరుల వేదిక కోరుతోందన్నారు.

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్తీకరణ చట్టం 2014లో ప్రస్తావించని పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని ఆంధ్రప్రదేశ్ అంగీకరిస్తే రెండు రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల సమస్య పరిష్కారమ వుతుందని కేంద్ర జలశక్తి శాఖ మంత్రి పాటిల్ ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు ఢిల్లీలో కలిసిన సందర్భంలో సూచించినట్లు వార్త ప్రచురించబడింది. కేంద్ర మంత్రి సూచనను రాష్ట్ర ముఖ్యమంత్రి తిరస్కరించారో లేదా మోనంగా ఉన్నారో తెలుసుకునే హక్కు రాష్ట్ర ప్రజలకు ఉన్నది. గోదావరి కావేరి నదుల అనుసంధాన పథకంలో భాగంగా గోదావరిపైన నిర్మిస్తున్న సమ్మతః సారాలక్క ఎత్తిపోతల పథకం దగ్గర నుండి నాగార్జునసాగర్ అనుసంధానాన్ని అంగీకరిస్తే, పోలవరం నల్లమలసాగర్ అనుసంధానాన్ని సమాంతరంగా చేపట్టే ఆలోచన చేస్తామని కేంద్ర మంత్రి సూచించినట్లు కూడా ఆ వార్తలో పేర్కొన్నారు. పోలవరం పైభాగం నుండి గోదావరి అవేది అనుసంధాన పథకానికి ఆంధ్రప్రదేశ్ అంగీ కరిస్తే, ఆదొక ఆత్మహత్యా సదృశ్యంగా మారుతుందని హెచ్చరిస్తు న్నాము. రాష్ట్ర ముఖ్యమంత్రి మళ్ళీ పోలవరం బనకచెర్ల ఎత్తిపోతల పథకం ప్లే ఫీజిబిలిటీ, రిపోర్టుకు ఆమోదం తెలియజేయాలని కేంద్ర జలశక్తి మంత్రికి విజ్ఞప్తి చేసినట్లుగా కూడా వార్తలో ప్రస్తావించారు. నిజంగా చేసి ఉంటే అత్యంత గర్హనీయం. పోలవరంర్ల సాధక ప్రాజెక్టు నిర్మాణాన్ని గోదావరి ట్రిబ్యునల్ మరియు కేంద్ర జల సంఘం అమోదించిన 15,72 మీటర్ల ఎత్తుతో పూర్తి చేసి, 191 టియంల గరిష్ఠ నిల్వతో నిర్దేశిత లక్ష్యాల సాధనకు అనుగుణంగా నిధుల మంజూరుపై కేంద్ర బలశక్తి మంత్రి స్పందన ఏమిటో బహిర్గతం చేయండి. పోలవరం 41.15 నుండి 45.72 మీటర్ల కాంటూర్ సంధిలోకి వచ్చే నిర్వాసతులకు ఆర్ అండ్ ఆర్ పథకం అమలుపై స్పష్టత ఇవ్వాల్సి న బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉన్నది. ఆల్మట్టి డ్యాం ఎత్తు పెంచడానికి కర్ణాటక ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను కేంద్ర జలశక్తి మంత్రి దృష్టికి తీసుకెళ్లి, వాటిని అడ్డుకోవడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రయత్నించడం అభినందనీయం అని ఆలోచనపరుల వేదిక రాష్ట్ర నాయ కులు లక్ష్మినారాయణ అందులో పేర్కొన్నారు.

# అనంత రుణం తీర్చుకోవాలనుంది - డియర్ ఉమ ఫేమ్ సుమయారెడ్డి



అనంతపురంలో ఓ కార్యక్రమంలో పాల్గొన్న సినీనటి సుమయన రెడ్డి

అనంతపురం, మే 12 ప్రభాతవార్త బ్యూరో

మానవత్వం చాటుకుని అంధులకు అండగా నిలచిన సినీనటి ఎవరు ఎంత ఎదిగినా కన్నతల్లిని, ఉన్న ఊరు రుణం తీర్చుకుంటేనే జన్మకు సార్ధకమని సినీనటి డియర్ ఉమ ఫేమ్ సుమయారెడ్డి అన్నారు. నగర శివారులోని అంధుల ఆశ్రమానికి వాటర్ ఫ్రిడ్జ్ అవసరమని ఆమె సన్నిహి తులు సుదర్శనరెడ్డి ద్వారా తెలుసుకున్న ఆమె హనుమజ్జయంతి సందర్భ ంగా మంగళవారం అనంతకు విచ్చేశారు. నేరుగా అంధుల ఆశ్రమానికి వెళ్లి రూ. 50 వేలు విలువ చేసే వాటర్ ఫ్రిడ్జ్లను ఆశ్రమ నిర్వాహకులు లక్ష్మి నారాయణకు అందించారు. అలాగే 40 మంది అంధ మహిళలకు సంవత్సరం పాటూ అవసరమయ్యే శానిటరీ న్యాప్కిన్స్, కూల్ వాటర్ బాటిల్స్ అందించారు. ఈ సందర్భంగా సాగిన సమావేశంలో సుమయారెడ్డి మాట్లాడుతూ తాను చిన్నప్పుడు నగరంలోని శాంతి విద్యానికేతన్‌లో చదువుకున్నానని, సినిమా అవకాశాలు రావడంతో హైదరాబాదుకు వెళ్లాల్సి వచ్చిందని అప్పటి సంగతులను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా చదువు చెప్పిన గురువులకు కృతజ్ఞతలు తెలిపారు. తల్లిదండ్రుల, జన్మభూమి రుణం తీరేది కాదని కానీ ప్రతివారూ తమకు ఉన్నంతలో సేవ చేసుకోవాలని సూచించారు. ఆశ్రమ నిర్వాహకులు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అనంత ఎంతో మంది కళాకారులకు జన్మనిచ్చిందని చాలా మంది ఉన్నతంగా ఎదగడం ఆనందంగా ఉందన్నారు. ఆ కోవలోనే సుమయారెడ్డి మరిన్ని సిని మాలలో నటించి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. ఆమె మా నవత్వం స్ఫూర్తిదాయ కమని, అడగగానే స్పందించి మహిళల పట్ల మమకారం చాటుకోవడం పట్ల ధన్యవా దాలను తెలియ జేశారు. అనం తరం సుమయారెడ్డి తనతో కలిసి చదువుకున్న స్నేహి తులతో ఆత్మీయంగా ముచ్చటించి కుశలప్రశ్నలతో అప్పటి జ్ఞాపకాలతోత సరదాగా గడిపారు.

# టిడిపి రాష్ట్ర పరిశీలకులు పల్లా జన్మదిన వేడుకలు



జన్మదినోత్సవాన్ని నిర్వహిస్తున్న నాయకులు

అనంతపురం క్రైమ్ మే 12 ప్రభాతవార్త

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు జన్మదిన వేడుకలను అనంతపురం జిల్లా అధ్యక్షులు పూల నాగరాజు ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముతవల్లిల సంఘం అధ్యక్షులు కె.యం.షకిల్ షఫీ, మాజీ జిల్లా అధ్యక్షులు సరిపూటి సూర్యనారాయణ, బాంబే డయింగ్ నాగన్న, రాష్ట్ర నాయకులు గడ్డం సుబ్రహ్మణ్యం, క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ ఈటె స్వామిదాసు,జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, జిల్లా ఉపాధ్యక్షులు కృష్ణ కుమార్ , మాజీ గ్రంధాలయ చైర్మన్ గౌస్ మొహిద్దిన్, కూచి హరి, కార్యకర్తలు పాల్గొన్నారు. పల్లా శ్రీనివాసరావు మరిన్ని పుట్టినరోజులు జరుపుకోవాలని, వారు నిండు నూరేళ్లూ ఆరోగ్యంగా ఉంటూ పార్టీని మరింత ఉన్నత శిఖరాలకు చేర్చాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని వక్తలు కోరారు.

# విద్యార్థి కల నెరవేరిన వేళ - ఫ్లైట్ ఎక్కించిన ఉపాధ్యాయిని



ఎయిర్ పోర్టులో ఉపాధ్యాయిని తో విద్యార్థిని సుప్రజ

చిలమత్తూరు, మే 12 ప్రభాతవార్త

10వ తరగతి ఫలితాల్లో చిలమత్తూరు మండల టాపర్‌గా నిలిచిన చిలమత్తూరు జెడ్‌పిహెచ్ఎస్ స్కూల్‌కు చెందిన విద్యార్థిని సుప్రజ కలను ఆ పాఠశాల బయాలజి ఉపాధ్యాయిని మాధవి నెరవేర్చారు. ఫ్లైట్ ఎక్కాలని వుంది మేడం ఒక్కసారైనా విమానం ఎక్కి ప్రయాణించాలన్నది తన కోరిక అని నేను ఖచ్చితంగా 10వ తరగతిలో మండల టాపర్‌గా ఉత్తీర్ణత సాధిస్తాను మేడం నా కల నెరవేరుస్తారా అని అడుగగా ఖచ్చితంగా నీ కల నెరవేరుస్తా మొదట చదువుపై దృష్టి సారించి మండల టాపర్‌గా నిలిస్తే బెంగుళూరు నుండి హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్‌సిటీకి తీసుకెళతానని ఉపాధ్యాయిని మాధవి విద్యార్థిని సుప్రజకు భరోసా ఇచ్చారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకన్న విద్యార్థిని సుప్రజకు ఉపాధ్యాయిని మాధవి తన మాట కూడా నిలబెట్టుకోవాలని మంగళవారం ఇద్దరూ బెంగుళూరు ఎయిర్‌పోర్టు నుండి విమానంలో హైదరాబాద్‌కు ప్రయాణించారు. దీంతో విద్యార్థిని సుప్రజ కల నెరవేరడంతో సుప్రజ ఆనందానికి హద్దులు లేకుండా పోయింది. విద్యార్థి ప్రతిభను గుర్తించి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న ఉపాధ్యాయిని చొరవ చూసి సామాజిక మాధ్యమాల్లో ఇలాంటి ఉపాధ్యాయులే కదా కావాల్సింది అంటూ నెటిజన్లు హ్యాపి జర్నీ అంటూ శుభాకాంక్షలు తెలియచేశారు.

# కన్నులపండువగా ఆంజనేయస్వామి గ్రామోత్సవం



స్వామివారి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

పెద్దవడుగూరు, మే 12 ప్రభాతవార్త

హనుమాన్ జయంతిని పురస్కరించుకుని మండలంలోని కోటకొండ, క్రిష్టిపాడు మల్లేనిపల్లి, పెద్దవడుగూరు తదితర గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అర్చకులు స్వామివారికి అభిషేకాలు, ఆకుపూజలు, అర్చనలు, తదితర పూజా కార్యక్రమాలను శాస్త్రోకంగా నిర్వహించారు. అలాగే సా ్వమివారి గ్రామోత్సవాన్ని మేళతాళాల నడుమ అంగరంగవైభవంగా నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. గ్రామోత్సవంలో ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ ఆంజనేయులు ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# హనుమంతుని సేవలో ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం క్రైమ్ మే 13 ప్రభాతవార్త

హనుమజ్జయంతి సందర్భంగా అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ హనుమంతుని సేవలో గడిపారు. ఆయన పలు ఆలయాలకు వెళ్లి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మారుతి నగర్ లోని ఆంజనేయస్వామి దేవాలయానికి వెళ్లారు. ఆ తర్వాత మధ్యాహ్నం కోర్టు రోడ్డులోని అభయాంజనేయస్వామి ఆలయాన్ని సందర్శించుకున్నారు. హౌసింగ్ బోర్డులోని అభయాంజనేయస్వామి ఆలయానికి వెళ్లారు. భారీ ఏకశిలా విగ్రహాన్ని దర్శించుకున్నారు.

ఎమ్మెల్యేకు ఆలయ నిర్వాహకులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. జిల్లా అధ్యక్షుడు పూలనాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరిలు కూడా ఆలయాలను దర్శించుకున్నారు. అర్చకులు తీర్థప్రసాదాలు, ఆశీర్వచనాలు అందజేశారు.

కోర్టు రోడ్డులోని ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రారంభించారు. భక్తులకు స్వయంగా ఆయన భోజనం వడ్డించారు. భక్తులు ఆలయాలకు భారీగా తరలివస్తున్న నేపథ్యంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ప్రజలందరిపై ఆంజనే యస్వామి ఆశీస్సులు, కృపా కటాక్షాలు ఉండాలని ఆకాంక్షించారు.

# హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జె.సి



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి

తాడిపత్రిఅర్బన్, మే 12 ప్రభాతవార్త

హనుమాన్ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి పాల్గొని ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. మంగళవారం పెద్దపప్పూరు మండలం జూటూరు గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంతో పాటు పెద్దవడుగూరు మండలం కోటకొండ ఆంజనేయస్వామి ఆలయంలో ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డికి స్వామివారి ప్రసాదాలు అందచేసి ఆశీర్వదించారు. అదేవిధంగా యాడికి మండలం వెంగన్నపల్లి గ్రామంలోని జె.సి అనుచరుడు నాగమునిరెడ్డి మనవడి కేశఖండన కార్యక్రమానికి ఎమ్మెల్యే జె.సి హాజరై చిన్నారిని ఆశీర్వదించారు.

# పూజల్లో పాల్గొన్న జె.సి ప్రభాకర్‌రెడ్డి



ఆంజనేయస్వామికి పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

తాడిపత్రిఅర్బన్, మే 12 ప్రభాతవార్త

హనుమాన్ జయంతి పురస్కరించుకొని తాడిపత్రి పట్టణంలోని నందలపాడు, అశోక్‌పిల్లర్ వద్ద గల అభయాంజనేయస్వామి విగ్రహం వద్ద మంగళవారం నిర్వహించిన ప్రత్యేక పూజల్లో మాజీ ఎమ్మెల్యే జె.సి ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అలాగే ఆలయ నిర్వాహకులు భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో జె.సి ప్రభాకర్‌రెడ్డి పాల్గొని స్వయంగా భక్తులకు కొంతసేపు భోజనం వడ్డించారు. హాజరైన భక్తులను ఆయన ఆప్యాయంగా పలుకరిస్తూ అందరిని ఉత్సాహపరిచారు.

# టపాసుల గోదాములపై ఆకస్మిక తనిఖీలు

## - భద్రతా ప్రమాణాలు పాటించకపోతే కఠిన చర్యలు - తహశీల్దార్ సోమశేఖర్



తాడిపత్రిటౌన్, మే 12 ప్రభాతవార్త

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తాడిపత్రి పట్టణంలోని టపాసుల నిల్వ, విక్రయ కేంద్రాలపై తహశీల్దార్ సోమశేఖర్, సివిల్ సప్లైస్ డిప్యూటీ తహశీల్దార్ మల్లేష్‌ప్రసాద్‌లు మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని గన్నెవారిపల్లికాలనీలో ఉన్న శ్రీబాలాజీ క్రాకర్స్, వాసవి ఫైర్ వర్క్స్ గోదాములను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. నిల్వ ఉంచిన బాణసంచా పరిమాణం, లైసెన్స్ నిబంధనల అమలు, అగ్నిమాపక భద్రతా ప్రమాణాలను తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా గోదాముల్లో తగినన్ని అగ్నిమాపక యంత్రాలు, ఇసుక బకెట్లు, నీటి సౌకర్యం ఉన్నాయా లేదా అని అధికారులు పరిశీలించారు. అనుమతించిన పరిమితికి మించి టపాసులు నిల్వ ఉంచరాదని యజమానులను హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా జనావాసాల మధ్య ప్రమాదకర రీతిలో నిల్వలు ఉంచితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజల భద్రత దృష్ట్యా ప్రతి వ్యాపారి ప్రభుత్వ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలన్నారు. తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని తహశీల్దార్ తెలిపారు.

టపాసుల గోదామును పరిశీలిస్తున్న తహశీల్దార్

# నూతన రైళ్ళను ప్రారంభించిన ఎంపీ లక్ష్మి నారాయణ

( మొదటి పేజీ తరువాయి ) వారు తెలిపారు. మంజూరు అయ్యే అవకాశం ఉన్నట్లు వారు తెలిపారు. అలాగే అయోధ్య రామమందిరానికి వెళ్లడానికి బెంగళూరు నుంచి అయోధ్యకు వెళ్లడానికి సమ్మర్ స్పెషల్ ట్రైన్ ప్రస్తావించినట్లు పలు తెలిపారు. రవాణా సౌకర్యాలను మెరుగుపరచడానికి రైల్వే ఎంత ఉపయోగపడుతుందని అలాగే అలాగే గుంతకల్ డివిజన్లో దాదాపు 1000 కోట్ల అభివృద్ధి పనులు జరుగు తున్నాయి అన్నారు. అయితే గత సంవత్సరం చూస్తే ..2,000 కోట్ల పైగా ఆదాయాన్ని రైల్వే అర్జించినట్లు వారు తెలిపారు. రాష్ట్రంలోనే అత్యధిక ఆదాయం కలిగిన డివిజన్ అంటే గుంతకల్లు అంటూ వారు తెలిపారు. గుంతకల్ నుంచి పలు ప్రాంతాలకు అనేక రైలు గురించి ప్రస్తావించినట్లు అలాగే అనేక సమస్యలు మా దృష్టికి తీసుకు వచ్చినట్లు వారు తెలిపారు. అలాగే కొన్ని రైల్వేస్టేషన్లో ఎక్స్‌ప్రెస్ రైల్ నిలుపుదల చేయాలంటూ ప్రజల నుంచి విన్నపాలు వచ్చినట్లు తెలియజేశారు. ప్రజల కోరిక మేరకు రైల్ లను ఆపు చేసేలా చర్యలు తీసుకుంటామంటున్నారు. ఈరోజు గర్వంగా చెప్పుకోవాలంటే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆంధ్రప్రదేశ్ పైన ప్రత్యేకమైన అభిమానంతో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రైల్వే ల గురించి ప్రధానికి తెలియజేస్తే వారు వెంటనే స్పందిస్తూ అనేక రైల్వే సమస్యలను నెరవేర్చినట్లు వారు తెలిపారు. అలాగే రాష్ట్ర అభివృద్ధి కోసం పార్లమెంటులో సభ్యులను లేవనెత్తాలంటూ రాష్ట్రాన్ని ఉపయోగపడే అభివృద్ధి కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలంటూ పదే పదే పార్లమెంట్ సభ్యులకు తెలియజేస్తారు. గుంతకల్ డిజైన్లు దాదాపు 570 కోట్ల రూపాయలతో 17 అమృత్ భరత్ రైల్వే స్టేషన్ అభివృద్ధి చేసినట్లు వారు తెలిపారు. 130 కోట్ల రూపాయలతో అనంతపురం, గుత్తి, తాడిపత్రి అభివృద్ధి చేసినట్లు తెలియజేశారు. లిఫ్టులు ఎస్కలేటరు టాయిలెట్లు అలా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నట్లు వారు తెలిపారు.950 కోట్ల రూపాయలతో గూడ్స్ రవాణా ద్వారా లాభాన్ని అందించినట్లు వారు తెలియజేశారు. రైల్వే సమస్య నుంచి మాకు తెలియజేస్తే వాటిపై చర్యలు తీసుకొని అభివృద్ధికి తోడ్పడుతామంటూ అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ర్నాష్ట్ర విడిపోయిన తర్వాత విశాఖ జోనల్ గా సౌత్ కోస్టల్ రైల్వేలో విలీనమైతున్నట్లు తెలిపారు. గుంతకల్ రైల్వేస్టేషన్లో లిఫ్టులు ఎస్కేటరు సరిగా పనిచేయట్లని కొత్త వాటికి ఏర్పాటుచేసి వికలాంగులు వృద్ధులకు సేవలు అందించాలంటూ అధికారులకు తెలియజేశారు. గుంతకల్ ప్రాంతంలో అనేక సమస్యలపై స్పందించి తీసుకుంటామని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు బిజెపి నాయకులు జనసేన నాయకులు పాల్గొన్నారు.

# తెల్ల బంగారం పత్తి ధరలు పైపైకి

( మొదటి పేజీ తరువాయి ) చేయకుండా ఇళ్లల్లో నిల్వ ఉంచుకున్న రైతులు మాత్రం ఆనందానికి గురవుతున్నారు. అనంతపురం జిల్లాలో నల్ల రేగడి భూములు ఉన్న కొన్ని మండలాల్లో పత్తి సాగు కు రైతులు ఆసక్తి చెబుతున్నారు. వాణిజ్య పంటగా పత్తి సాగును గుర్తించి రైతులు ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసేందుకు 5,6 ఏళ్లుగా ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. వేరుశనగ పంటను తగ్గించి క్రమంగా పత్తి లాంటి ఇతర వాణిజ్య పంటలవైపు రైతులు మొగ్గు చెబుతున్నారు. గత ఖరీఫ్ సీజన్లో అనంతపురం జిల్లాలో 1,82,000 హెక్టార్లు సాధారణ విస్తీర్ణం కాగా 89,816 హెక్టర్ల భూమిలో వేరుశనగ వేశారు. సబ్సిడీ ధరలతో వేరుశనగ విత్తనాలు ఇచ్చినప్పటికీ వేరుశనగ సాగు విస్తీర్ణం పెరగలేదు. అనంతపురం, శ్రీ సత్య సాయి జిల్లాలో వేరుశనగ సాగు విస్తీర్ణం పెంచేందుకు వేరుశనగ విత్తనాలకు సబ్సిడీ మొత్తము పెంచాలని , వచ్చే ఖరీఫ్ నుంచైనా రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశలో చర్యలు తీసుకోవాలని అన్నదాతల కోరుకుంటున్నాను. ఇక పత్తి పంట విషయానికొస్తే అనంతపురం జిల్లాలో గత ఖరీఫ్ సీజన్లో 44,001 హెక్టార్ల భూమి పత్తికి సాగుభూమి కాగా 29,771 హెక్టార్ల భూమిలో రైతులు పత్తి పంట సాగు చేశారు. రబీ సీజన్లో కూడా కొంతమేర రైతులు పంట సాగు చేశారు. అనంతపురం జిల్లాలో తాడపత్రి, గుంతకల్లు, సింగనమల నియోజకవర్గం లలో పత్తి సాగు ఎక్కువగా ఉంది. ముఖ్యంగా పెద్దవడుగూరు, గుత్తి, గుంతకల్లు, యాడికి, తాడపత్రి, పెద్ద పప్పురూ తదితర మండలాల్లో పత్తి సాగు పెరుగుతోంది.. తాడపత్రి నియోజకవర్గంలోని యాడికి మండలంలో వి. కొట్టాలపల్లి, వేములపాడు, తిప్పారెడ్డిపల్లి, చీమల వాగుపల్లి, నిట్టూరు తదితర గ్రామాలు, తాడపత్రి మండలంలో గంగాదేవి పల్లి, బ్రాహ్మణపల్లి, చిక్కులూరు, పులి పొద్దుటూరు తదితర గ్రామాల్లో రైతులు పత్తి సాగుకు ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు. గత ఐదేళ్లలో ఆ ప్రాంతం గణనీయంగా పత్తి సాగు విస్తీర్ణం పెరగగా వేరుశనగ సాగు విస్తీర్ణం తగ్గుతూ వచ్చింది. రైతులు పండించిన పత్తి పంటను బళ్లారి, ఆదోని మార్కెట్లకు నేరుగా తీసుకెళ్లి అమ్మకాలు చేసుకునేవారుగా ఉన్నారు. ఇదే సమయంలో బళ్లారి, ప్రొద్దుటూరు తదితర ప్రాంతాల నుంచి వ్యాపారస్తులు కూడా వస్తున్నారని రైతులు చెబుతున్నారు. యాడికి మండలం వి .కొట్టాలపల్లి గ్రామంలో 80 శాతం భూములలో పత్తి పంట సాగు చేస్తారని ఆ గ్రామ రైతులు కోమ్మ ప్రసాద్ రెడ్డి, ఆర్. అమరేశ్వర్ రెడ్డి, పేరం కేశవరెడ్డి, ఏ .రామాంజనేయులు, ఆర్. రమేష్ రెడ్డి తదితర రైతులు చెబుతున్నారు. కష్టపడి పండించిన పత్తి పంటను గిట్టుబాటు ధరతో కొనుగోలు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటే రైతులు ఇబ్బందులను ఆదుకున్నట్లుఅవుతుందని ఆ దిశలో చర్యలు తీసుకునే విధంగా అధికారులు చొరవ చూపాలని రైతులు కోరుతున్నారు. పొద్దుటూరు, బళ్లారి, తదితర ప్రాంతాల నుంచి స్థానిక వ్యాపారులు యాడికి మండలంతో పాటు తాడపత్రి రూరల్,పెద్దవడుగూరు , సింగనమల తదితర మండలాలకు వచ్చి పత్తి కొనుగోలు చేస్తూ ఉంటారు. వంట దిగుబడి వచ్చే సమయంలోనే గిట్టుబాటు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేస్తే మధ్య దళారీలకు రైతులు అమ్మకాలు చేయకుండా ఉంటారు. ఆ ప్రాంతంలో పత్తిని తెల్ల బంగారంగా భావిస్తూ ఆ పంటను ఎక్కువగా సాగు చేసేందుకు ఆసక్తి చూడడంతో పాటు ధర వచ్చేవరకు ఇళ్లలో పత్తి నిల్వలు ఉంచుకునే రైతులు కూడా ఉన్నారు.. గత ఏడాది రైతులు సాగుచేసిన పత్తి పంట క్వింటాలు 6500 నుంచి 7500 వరకు పలికింది.ఈ ఏడాది అనంతపురం జిల్లాలో ఉరవకొండ, గుంతకల్లు, తాడపత్రి, సింగనమల తదితర నియోజకవర్గం లలో నల్ల రేగడి భూములు ఉన్నాయి.. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎర్ర రేగడి భూములే ఎక్కువ గా ఉన్నాయి. అందుకే వర్షాభావంలో కూడా తట్టుకునే వేరుశనగ సాగుకు ఎన్నో ఏళ్లుగా రైతులు ఆసక్తి చూపుతూ వచ్చారు. దక్షిణ భారతదేశంలోనే వేరుశనగ సాగులో ఉమ్మడి అనంతపురం జిల్లాకు గుర్తింపు ఉండేది. రికార్డు స్థాయిలో రైతులు వేరుసెనగ సాగు చేస్తూ వచ్చారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ఉమ్మడి అనంతపురం జిల్లా రైతులకు సబ్సిడీ వేరుశనగ విత్తనాలతో పాటు పంటలు నష్టపోతే ఇన్పుట్ సబ్సిడీ , పంటల బీమా కింద నష్టపరిహారం ఇచ్చేవారు. రాను రాను పాలక ప్రభుత్వాలు ఇన్ పుట్ సబ్సిడీ, పంటల బీమా కింద పరిహారాలను సరిగా ఇవ్వడం లేదు. ఈ సమస్యను ఎమ్మెల్యేలు, ఎంపీలు తమ రాష్ట్ర నేతల దగ్గరికి తీసుకుపోవడం లేదు అని రైతుల్లో అభిప్రాయం అవుతుంది. అనావృష్టి, అతివృష్టి వల్ల వివిధ పంటలు నష్టపోతే గతంలో రైతులను ఆదుకున్నట్లే ఇప్పుడు కూడా ఉడుతా భక్తి లా కాకుండా గతంలో మాదిరి ఆప్రక్రియను కొనసాగించాలని రైతులు కోరుతున్నారు. పత్తి, వేరుశనగ, పప్పు శనగ, ధనియాలు తదితర వాణిజ్య పంటల సాగు విస్తీర్ణం పెంచేందుకు సబ్సిడీ ధరలతో విత్తనాలు, మందులను తమకు అందించేందుకు కూటమి ప్రభుత్వ పెద్దలు దృష్టి పెట్టాలని రైతుల కోరుకుంటున్నారు.